విలేఖరులు కావలెను

ప్రజాపక్షమే లక్ష్యంగా సీనియర్ జర్నలిస్టు మేడే శాంతికుమార్ సారధ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వెలువడుతున్న ధర్మఘంట తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అన్ని జిల్లాలకు జిల్లా ప్రతినిధులు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, మండల విలేఖరులు కావలెను. ఆసక్తి గల వారు తమ బయోడేటాను ఈక్రింది చిరునామాకు పంపించగలరు..

స్ఫూర్తి పబ్లికేషన్స్, నెం: 7-8-94/2, శ్రీనగర్ కాలనీ, పానగల్ రోడ్డు, నల్లగొండ-508001. ఫోన్ నెం: 9885826108.
E-mail: shanthimama@gmail.com



ప్రజల కోసం - ప్రకృతి కోసం - సామాన్యుని గొంతుగా - సామాజిక సమరంగా స్ఫూర్తి పబ్లికేషన్స్ వారి

# ధర్మఘంట

తెలుగు జాతీయ దిన పత్రిక

TELTEL/2012/47103

సంపుటి : 12 సంచిక :86 నల్గొండ గురువారం 19-06-2025 ఎడిటర్ : మేడే శాంతికుమార్ పేజీలు : 4 వెల : రూ.1/-


## జీఎంఆర్ ఆధ్వర్యంలో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ సరికొత్త రికార్డు!




హైదరాబాద్,మే నెలలో శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రికార్డు స్థాయిలో 27 లక్షలకు పైగా ప్రయాణికులు రాకపోకలు సాగించారు. ఢిల్లీ విమానాశ్రయంతో పోలిస్తే 15.3% అధిక వృద్ధిని సాధించింది. దేశీయ, అంతర్జాతీయ విమానాల సంఖ్య పెరుగుదలతో ప్రయాణికుల రద్దీ పెరిగింది.అత్యంత రద్దీగా ఉండే విమానాశ్రయాలలో శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ ఒకటి. ప్రతిరోజు వేలాది మంది ప్రయాణికులతో కిటకిటలాడుతూ ఉంటుంది. ఈ విమానాశ్రయం నుంచి లక్షలాదిమంది ఇతర రాష్ట్రాలకు, దేశాలకు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ఈ ఎయిర్‌పోర్ట్‌లో ప్రత్యేక నిఘా వ్యవస్థతో పాటు సెంట్రల్, స్టేట్ పోలీసులతో భారీ భద్రత ఉంటుంది. భద్రత విషయంలో హై సెక్యూరిటీ జోన్ ఉన్నటువంటి ఎయిర్ పోర్ట్‌గా గుర్తింపు కూడా ఉంది. అదే విధంగా ఈ ఎయిర్ పోర్ట్ నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తూ జీఎంఆర్ సంస్థ మరొక రికార్డును తమ ఖాతాలో వేసుకుంది.ఎయిర్ పోర్ట్ ప్రారంభం అయిన తర్వాత గత నెల అత్యధిక మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. ఢిల్లీతో పోలిస్తే ప్రయాణికుల విషయంలో మన శంషాబాద్ విమానాశ్రయం ముందంజలో ఉంది. జీఎంఆర్ సంస్థ మొత్తం ఐదు విమానాశ్రయాలను నిర్వహిస్తోంది. తమ ఆధ్వర్యంలో నడుస్తున్నటువంటి ఐదు విమానాశ్రయాలకు సంబంధించి మే నెలలో ప్రయాణికుల రాకపోకలపై వృద్ధిపై ఒక నివేదిక విడుదల చేసింది. ఈ ఐదు విమానాశ్రయాల్లో కలిపి మొత్తం కోటి మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగించారని పేర్కొంది. అయితే ఒక్క శంషాబాద్ విమానాశ్రయం నుంచి రికార్డ్ స్థాయిలో 27 లక్షల 91 వేల 217 మంది దేశీయ అంతర్జాతీయ ప్రయాణికులు రాకపోకలు సాగించారు.మే నెలలో జీఎంఆర్ విమానాశ్రయాలలో సగటు ప్రయాణికుల వృద్ధి 0.8 శాతంగా నమోదైంది. కానీ, శంషాబాద్ విమానాశ్రయం అత్యధికంగా 15.3 శాతం వృద్ధిని సాధించింది. అదే సమయంలో ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం 4.5 శాతం వృద్ధి నమోదు చేసింది. ప్రతిరోజు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికుల సంఖ్య దాదాపు లక్షకు చేరువవుతోంది. ఇప్పటివరకు ప్రతి రోజు 95 వేల నుంచి 97 వేల మంది ప్రయాణికులు రాకపోకలు కొనసాగిస్తున్నారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి దేశంలో 74 ప్రాంతాలకు విదేశాల్లోని 21 ప్రాంతాలకు ప్రతి రోజు 620 విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయి.

## మధ్యవర్తిత్వాన్ని భారత్ ఎన్నటికీ అంగీకరించదు..

న్యూఢిల్లీ,ఇటీవలే భారత్ -పాక్ మధ్య ఉద్రిక్తతలను తానే ఆపానని, రెండు దేశాల మధ్య జరిగిన కాల్పుల విరమణ ఒప్పందం తన ఘనతే అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (డొనాల్డ్ ట్రంప్) పదేపదే చెప్పుకుంటున్న విషయం. ట్రంప్ ప్రకటనపై ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ట్రంప్ ప్రకటనపై మోదీ మౌనం వీడాలని, ఆయన వ్యాఖ్యలపై స్పష్టతనివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పాక్‌తో కాల్పుల విరమణ ఒప్పందంలో అమెరికా పాత్రపై ప్రధాని తొలిసారి స్పందించారు. మధ్యవర్తిత్వాన్ని భారత్ ఎన్నటికీ అంగీకరించదని స్పష్టం చేశారు.ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రస్తుతం కెనడా పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే.జీ7 దేశాల శిఖరాగ్ర సదస్సు కోసం అక్కడికి వెళ్లారు. ఈ సందర్భంగా సదస్సులో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మోదీ సమావేశం కావాల్సి ఉంది.అయితే, ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఉన్నపలంగా ట్రంప్ కెనడా నుంచి అమెరికా వెళ్లిపోయారు. దీంతో ప్రధాని మోదీ.. ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడారు.భారత్-పాక్ మధ్య ఒప్పందం విషయంలో అమెరికా ప్రమేయం లేదని ట్రంప్‌తో ప్రధాని తేల్చిచెప్పారు. ఈ కేంద్ర విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ (విక్రమ్ మి స్రీ) ఏర్పాటు.



దాదాపు 35 నిమిషాల పాటూ ఇద్దరూ ఫోన్‌లో సంభాషించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా 'ఆపరేషన్ సిందూర్' వివరాలను ట్రంప్‌కు మోదీ వివరించినట్లు తెలిపారు. రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందానికి మిలటరీ స్థాయి చర్చలు జరిగాయి. ఇతరుల మధ్యవర్తిత్వాన్ని భారత్ ఎన్నటికీ అంగీకరించబోదనే అమెరికా అధ్యక్షుడికి మోదీ స్పష్టంగా చెప్పినట్లు మిస్రీ వివరించారు.

## హిందీ భాషపై వెనక్కి తగ్గిన మహారాష్ట్ర ప్రభుత్వం..

ముంబై:మహారాష్ట్ర లో మరాఠీ, ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు మూడో భాషగా హిందీని తప్పనిసరిగా బోధించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే నిర్ణయించిన విషయం తెలిసిందే. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) అమలులో భాగంగా ప్రాథమిక పాఠశాలల్లో హిందీని తప్పనిసరిగా మూడవ భాషగా బోధించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు రెండు నెలల క్రితం ఉత్తర్వులు కూడా జారీ చేసింది. అయితే, ఆ నిర్ణయంపై మహా సర్కార్ తాజాగా వెనక్కి తగ్గింది. ఈ మేరకు గతంలో జారీ చేసిన ఉత్తర్వుల్లో మార్పులు చేసింది. హిందీ తప్పనిసరి అన్న పదాన్ని నోటిఫికేషన్‌లో తీసేసింది. కాగా, జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) అమలులో భాగంగా ప్రాథమిక పాఠశాలల్లో హిందీని తప్పనిసరిగా మూడవ భాషగా బోధించాలని మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీనిపై కాంగ్రెస్, ఎంఎన్ఎస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఎంఎన్ఎస్ చీఫ్ రాజ్ ఠాక్రే ఎక్స్‌లో స్పందిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వంతోపాటు కేంద్ర ప్రభుత్వంపైన కూడా విరుచుకుపడ్డారు.త్రిభాషా సూత్రాన్ని ప్రభుత్వ వ్యవహారాలకే పరిమితం చేసుకోవాలని, విద్య విషయంలో దానిని తీసుకురావద్దని హెచ్చరించారు. మహారాష్ట్రలో ప్రతి దానినీ హిందీయా



కరణ చేయడానికి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను అనుమతించేది లేదన్నారు. మరాఠీ, మరాఠీయేతరుల మధ్య ఘర్షణను సృష్టించి, రానున్న ఎన్నికల్లో లబ్ధి పొందడానికి ప్రయత్నిస్తున్నారా? అని నిలదీశారు. కాంగ్రెస్ శాసన సభా పక్ష నేత విజయ్ వడెట్టివార్ స్పందిస్తూ, ఈ నోటిఫికేషన్‌ను తక్షణమే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. హిందీ తప్పనిసారి ఏమీ కాదని స్పష్టం చేసింది.

## కేటీఆర్ ఫోన్ల కోసం ఏసీబీ వెయిటింగ్ !



హైదరాబాద్,ఫార్ములా ఈ రేసు కేసులో కేటీఆర్ ఫోన్లను అప్పగించాలని ఏసీబీ అధికారులు ఆదేశించారు. దానికి బుధవారం వరకూ గడువు విధించారు. కేటీఆర్ ఫోన్లను అప్పగిస్తారా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది. ఫార్ములా ఈ వ్యవహారం జరిగిన రెండు, మూడేళ్ల కాలంలో వాడిన ఫోన్లు అన్నింటినీ తీసుకు రావాలని ఏసీబీ అధికారులు చెప్పారు. గతంలో లిక్కర్ కేసులో కవిత .. చాలా ఫోన్లను ఈడీ అధికారులకు ఇచ్చారు. అలాగే ఇప్పుడు కేటీఆర్ కూడా నాలుగైదు ఫోన్లను ఇవ్వాల్సి ఉంటుందని భావిస్తున్నారు.కేటీఆర్ ఫోన్లను అప్పగిస్తారా లేదా అన్నదానిపై ఇంకా క్లారిటీ లేదు. ఫోన్లలో వ్యక్తిగత సమాచారం ఉంటుంది కాబట్టి అప్పగించే అవకాశం లేదని చెబుతున్నారు. అప్పగించకపోతే ఏసీబీ అధికారులు ఏం చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. మరో వైపు విదేశీ సంస్థకు డబ్బులు ట్రాన్స్ ఫర్ చేసిన ఐఏఎస్ అరవింద్ కుమార్ ను, కేటీఆర్ ను ముఖాముఖి విచారించేందుకు ఏసీబీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. విదేశీ పర్యటనలో ఉన్న అరవింద్ కుమార్ తిరిగి రానున్నారు.అప్పట్లో ప్రభుత్వ పెద్దలకు అత్యంత సన్నిహితంగా ఉన్న అరవింద్ కుమార్.. వారు చెప్పినట్టల్లా చేశారు. ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా కేవలం కేటీఆర్ ఆదేశాలతోనే డబ్బులు బదిలీ చేశానని ఆయన గతంలో స్టేట్మెంట్ ఇచ్చారు. ఈ క్రమంలో ఇద్దర్నీ కలిపి ప్రశ్నిస్తే కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు.

## ఇరాన్‌పై దాడి అంతర్జాతీయ భద్రతకు ముప్పు: రష్యా



మాస్కో: ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడులను రష్యా(రష్యా) ఖండించింది. ఇరాన్ అణు కేంద్రాలను టార్గెట్ చేయడం ఆమోదయోగ్యం కాదు అని రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖలోనిది. అణు కేంద్రాలను దాడి చేయడం వల్ల అంతర్జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని రష్యా హెచ్చరించింది. ఇరాన్‌పై దాడితో ప్రపంచ దేశాలను విపత్తులోకి నెట్టేస్తున్నారని రష్యా విదేశాంగ శాఖ అభిప్రాయ పడింది. గత శుక్రవారం నుంచి ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడి చేస్తున్న విషయం తెలిసిందే. ఆ రెండు దేశాల మధ్య వాయు ఘర్షణ అయిదో రోజుకు చేరుకున్నది. న్యూక్లియర్ బాంబును ఇరాన్ రూపొందిస్తున్నట్లు, అది తుది దశకు చేరుకున్నట్లు టెహ్రాన్‌పై ఆరోపణలు వస్తున్నాయి. అయితే ఆ ఆరోపణలను ఇరాన్ కొట్టిపారేసింది. ఇజ్రాయిలీ సైనిక ఆపరేషన్‌కు దీటుగా బదులుతోంది. తాజాగా హైపర్‌సోనిక్ క్షిపణులను కూడా విడుదల చేసింది.ఇరాన్‌లోని అణు కేంద్రాలు శాంతియుతంగా ఉన్నాయ'ని, కానీ వాటిపై ఇజ్రాయిల్ భీకరా దాడులు చేయడం.. అంతర్జాతీయ చట్టాలకు వ్యతిరేకమని రష్యా చేర్చింది. అంతర్జా భద్రతకు ముప్పు ఏర్పడుతుందని రష్య విదేశాంగ శఖ ఓ ప్రకటనలో తీయ నివేదన. ఒక వేళ ఈ దాడులు ఇలాగే కొన సాగితే, ఆ ప్రాంతం మొత్తం సమస్యాత్మకంగా మారుతుందని రష్య నివేదన. విచక్షణతో ఆలోచించి, అణు కేంద్రాలపై దాడులని ఆపాలని ఇజ్రాయిల్‌ను రష్యా కోరింది. ఇజ్రాయిల్‌కు మద్దతు ఇస్తున్న దేశాలు.. ఆ దేశానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు రష్య విదేశాంగ శాఖ చెప్పింది.అంతర్జాతీయ అటాక్ ఎనర్జీ ఏజెన్సీ ద్వారా వత్తిడి తీసుకువచ్చి, టెహ్రాన్‌పై అటాక్ చేసిన రష్యా దీని వల్ల ప్రస్తుత విషాదం నెలకొన్నట్లు చెప్పింది. పశ్చిమ దేశాలు అణు నిరాయుధీకరణ పేరుతో అంతర్జాతీయ దేశాలతో వత్తిడి తెస్తున్నట్లు రష్యా ప్రదర్శన. న్యూక్లియర్ నాన్ ప్రొలిఫిరేషన్ ట్రీటీ(ఎన్‌పీటీ) ఒప్పందాలను ఇరాన్ ఉల్లంఘించినట్లు ఐఏఈఏ విషయం తెలుస్తుంది. ఎన్‌పీటీ రూల్స్‌ను ఇరాన్ బ్రేక్ చేసిందన్న విషయాన్ని అమెరికా, యూకే, ఫ్రాన్స్, జర్మనీ దేశాలు వత్తిడి తెస్తున్నట్లు.

## ఇరాన్‌పై దాడి అంత ఈజీ కాదు.. అమెరికాకు షాకిచ్చేందుకు సిద్ధంగా టెహ్రాన్..

టెహ్రాన్:అమెరికా తమ అణుస్థావరాలపై దాడికి యత్నిస్తే.. ప్రతిదాడి చేయడానికి ఇరాన్ సన్నాహాలు చేస్తోంది. పశ్చిమాసియాలో అగ్రరాజ్య నౌకలకు ఉచ్చు పన్నే అవకాశం బలంగా ఉంది. 'బేషరతుగా లొంగిపోవాలి', 'అణ్వాయుధాలు వదిలేయాల్సిందే' అని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే ప్రకటనలు చేస్తున్న నేపథ్యంలో ఇరాన్ అప్రమత్తమైంది. ఒకవేళ వాషింగ్టన్ కూడా టెల్‌అవీవ్‌తో చేతులు కలిపి దాడిచేస్తే.. తగిన జవాబు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ విషయాన్ని 'న్యూయార్క్ టైమ్స్' పత్రిక కథనంలో వెల్లడించింది.

### టెహ్రాన్ భయానికి కారణాలు..

అమెరికా దాదాపు మూడు డజన్ల రీఫ్యూయిలింగ్ ట్యాంకర్లను ఐరోపా దేశాలకు చేర్చింది. వీటిని గల్ఫ్‌లోని తమ బేస్‌లను రక్షించే ఫైటర్ జెట్లు, ఇరాన్‌పై భారీ బాంబులతో దాడి చేసే లాంగ్ రేంజ్ బాంబర్లు వాడుకొనేందుకు సిద్ధం చేసినట్లు అనుమానాలున్నాయి. ఈ పరిస్థితుల్లో అమెరికాపై ప్రతిదాడి చేయాలంటే ఇరాన్ క్షిపణులు దాదాపు 10,000 కిలోమీటర్లకు పైగా దూరాన్ని ప్రయాణించాలి. అంత సామర్థ్యం ఉన్న మిసైల్స్ దాని వద్ద లేవు. అయితే దీనికి ప్రత్యామ్నాయ వ్యూహం ఇరాన్ వద్ద ఉంది.

### హర్మూజ్‌లో అమెరికా నౌకలకు ఉచ్చు..

ఈక్రమంలో ఇరాన్ మద్దతు ఉన్న హూతీలు, ఇరాక్, సిరియాలోని సాయుధ ముఠాలు ఎర్ర సముద్రంలోని నౌకలపై తిరిగి దాడులను ప్రారంభించే అవకాశం ఉందని అమెరికా అధికారులు చెబుతున్నారు. ఆ పరిస్థితుల్లో ఇరాన్ కూడా హర్మూజ్‌లో అండర్ వాటర్ మైన్స్‌ను పెట్టే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. దీంతో ఇప్పటికే పర్షియన్ గల్ఫ్‌లో స్థావరాల వద్ద ఉన్న అమెరికా యుద్ధ నౌకలు



బయటకు వెళ్లే వీల్లేకుండా ఇరుక్కుపోతాయి. ఆ సమయంలో ఇరాన్ వాటిపై క్షిపణి దాడులు చేసి ధ్వంసం చేస్తుంది. అమెరికా జోక్యం చేసుకొంటే.. వాటి స్థావరాలపై దాడి చేస్తానని ఇప్పటికే ఇరాన్ తేల్చిచెప్పింది.

### 40,000 మంది అమెరికా సిబ్బంది చిక్కుల్లో..

మధ్యప్రాచ్యంలోని ఇరాక్,యూఏఈ, జోర్డాన్, సౌదీ అరేబియా,ఖతార్‌లో ఉన్న 40,000 మంది అమెరికా మిలిటరీ సిబ్బంది ప్రమాదంలో పడతారు. ఇరాన్ దాడులు ఇరాక్‌లోని స్థావరాలతోనే మొదలుకావచ్చు.ఎందుకంటే అక్కడ టెహ్రాన్ మద్దతు ముఠాలు చురుగ్గా ఉన్నాయి.ఈ ప్రదేశంలో ప్రతిదాడికి ఇరాన్ పెద్దగా సన్నాహాలు చేయాల్సిన అవసరం కూడా లేదు. క్షిపణుల పరిధిలోకి బహ్రెయిన్, ఖతార్, యూఏఈ ఉన్నాయి.ఒక్కసారి వీటిపై దాడి జరిగితే..చమురు ధరలు భగ్గుమనడంతోపాటు..పశ్చిమాసియాను యుద్ధంలోకి లాగినట్లవుతుంది.

## బీసీ రిజర్వేషన్లపై జీవో జారీకి అభ్యంతరమేంటి..

హైదరాబాద్: బీసీలకు విద్య, ఉద్యోగ స్థానిక సంస్థలలో 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసిన ప్రభుత్వం జీవో జారీ చేయడానికి ఉన్న అభ్యంతరాలేమిటో స్పష్టం చేయాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లపై జీవో జారీ చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని, లేనిపక్షంలో బీసీల ఆగ్రహానికి గురికాకతప్పదని ఆయన హెచ్చరించారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్ అధ్యక్షతన బీసీ సంఘాల సమావేశం నిర్వహించా రు.బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావుతో కలిసి ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం న్యాయ నిపుణులు, బీసీ సంఘాలు, అన్ని పార్టీలతో సమావేశం ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



## సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపిన రాజా సింగ్



హైదరాబాద్,కొత్త గోశాల నిర్మించాలనే నిర్ణయం, తల్లి ఆవు గురించి ఆలోచించినందుకు, విధివిధానాలపై కమిటీని వేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీజేపీ ఎమ్మెల్యే రాజా సింగ్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. వేల సంఖ్యలో ఆవులు, దూడలు, ఎద్దులను ఇల్లీగల్ స్లేటర్ హౌస్‌లో చంపుతున్నారని దాని గురించి సీఎం ప్లాన్ ఆఫ్ యాక్షన్ గురించి చెప్పాలని కోరారు. మోడల్ గోశాలలు కడుతున్నారని.. చాలా మంచిదని ఆయన వ్యాఖ్యానించారు.

### రెండవ పేరు సీఎం రేవంత్ రెడ్డిదే..

గో రక్షణ గురించి ఒక స్పెషల్ పోలీస్ ఫోర్స్ తయారు చేయాలని, అందులో ఒక మెంబర్‌గా తనను కూడా ఉంచాలని ఎమ్మెల్యే రాజాసింగ్ సిఎం రేవంత్ రెడ్డిని కోరారు. దేశంలోని ముఖ్యమంత్రులందరిలో గోవులకు సేవ చేసే నిజమైన ముఖ్యమంత్రి ఎవరని అడిగితే, గుర్తుకు వచ్చే రెండవ పేరు రేవంత్ రెడ్డిదేనని అన్నారు. మొదటి పేరు యూపీ సీఎం యోగి అని పేర్కొన్నారు. ఈ పనులన్నీ ముఖ్యమంత్రి చేస్తే భారత దేశంలో ఒక మంచి గుర్తింపు దొరుకుతుందని ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు.

### ముగ్గురు అధికారులతో ఒక కమిటీ..

తెలంగాణలో గోవుల సంరక్షణకు ఎంత ఖర్చైనా ప్రభుత్వం వెనుకాడబోదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గోవుల సంరక్షణకు సమగ్ర విధానాన్ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ముగ్గురు అధికారులతో ఒక కమిటీని నియమించారు. గోవుల సంరక్షణ కోసం వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలను అధ్యయనం చేయాలని ఈ కమిటీని కోరారు. రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్,

## సంపాదకీయం

**గురువారం 19-06-2025**

# ఇష్టం లేని పెళ్లిళ్ల కారణంగానే హత్యలు!

మేఘాలయ 'హనీమూన్ మర్డర్' కేసు ఇటీవల సంచలనం సృష్టించింది. ఇండోర్ కు చెందిన సోనమ్, రఘువంశీల వివాహం జరగ్గా.. ఆ పెండ్లి ఇష్టం లేకపోవడంతో ప్రియుడితో కలిసి సోనమ్ భర్తను హత్య చేసేందుకు సుపారీ ఇచ్చినట్టు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. మీరట్లో సౌరభ్ రాజ్పుత్ అనే వ్యక్తిని అతని భార్య ముస్కాన్ రాస్తోగి, ఆమె ప్రియుడు సహిల్ శుక్లా హత్య చేసి, శవాన్ని సిమెంట్ డ్రమ్లో దాచారు. కర్ణాటకలో ఒక మాజీ డీజీపీని ఆమె భార్య కత్తితో పొడిచి హత్య చేసింది. యూపీ, ఢిల్లీ, బిహార్ ఇలా చాలా రాష్ట్రాల్లోనూ ఇలాంటి ఘటనలు తరచూ వినిపిస్తూనే ఉన్నాయి. భార్యలను హత్య చేస్తున్న ఘటనలు దేశంలో నిత్యకృత్యంగానే మారుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో జీవితభాగస్వాముల మధ్య హత్యలు తీవ్ర ఆందోళనను కలిగిస్తున్నాయి. అయితే ఇందులో 95 శాతానికి పైగా కేసుల్లో ఎవరికీ క్రిమినల్ రికార్డులు లేవు. 'పెళ్లి–విడాకులు అనే రెండు అంశాలపై సామాజికంగా వస్తున్న ఒత్తిళ్లు సామాన్య పౌరులను సైతం నేరస్తులుగా మారుస్తున్నాయి. చిన్న సొల్యూషన్ తో పరిష్కారమయ్యే సమస్యలు కూడా హత్యల వరకు దారితీస్తున్నాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో డేటా ప్రకారం.. 2022లో భారతదేశంలో మొత్తం 28,522 హత్య కేసులు నమోదయ్యాయి, ఇందులో దాదాపు పది శాతానికి పైగా అంటే 2,821 కేసులు జీవిత భాగస్వామి లేదా భాగస్వామి ప్రోత్సాహంతోనే జరిగినట్లు రికార్డులు చెబుతున్నాయి. 2022లో భార్యలు భర్తలను హత్య చేసిన, చేయించిన కేసులు 220కి పైగా నమోదయ్యాయి. అంటే ప్రతి 32 గంటలకు ఒక భర్త హత్యకు గురయ్యాడు. అదే సమయంలో భర్తలు భార్యలను హత్య చేసిన, చేయించిన కేసులు 270కి పైగా నమోదయ్యాయి. ఇందులో అదనపు కట్నం, వివాహేతర సంబంధాలు, ఇలా చాలా అంశాలు ఉన్నాయి. 2023, 2024 సంవత్సరాలకు సంబంధించిన డేటాను ఇప్పటికీ ఎన్సీఆర్బీ విడుదల చేయలేదు. అయితే 2023, 2024లో కూడా జీవితభాగస్వాముల హత్యలకు సంబంధించి కేసులు వేల సంఖ్యలోనే నమోదై ఉంటాయని ఒక అంచనా. భారతదేశంలో 85 నుంచి 90 శాతం అరేంజ్డ్ మ్యారేజెస్ జరుగుతున్నాయి. అందులో అబ్బాయి, అమ్మాయిల సమ్మతి తీసుకోకుండానే ఒత్తిడితో చేసిన వివాహాలే అధికంగా ఉన్నట్లు తెలుస్తున్నది. భారత సమాజంలో వివాహ బంధం అనేది ఇద్దరు వ్యక్తుల మధ్య కంటే.. కుటుంబాల మధ్య ఒప్పందంగా భావిస్తారు. కులం, మతం, ఆర్థిక స్థితి, సామాజిక స్థాయిని బట్టి జీవిత భాగస్వాములను ఎంపిక చేస్తారు. అయితే ఎక్కువ శాతం పెళ్లిళ్లలో జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునే స్వేచ్ఛ సంబంధిత వ్యక్తికి ఇవ్వరు. ముఖ్యంగా మహిళలు ఆర్థికంగా కుటుంబంపై ఆధారపడి ఉండడంతో వారికి నిర్ణయం తీసుకునే ఫ్రీడమ్ తక్కువగా ఉంటున్నది. చాలా మంది తమ అభిప్రాయాన్ని చెప్పలేక.. కుటుంబ సభ్యుల ఒత్తిడికి లొంగి పెళ్లిళ్లు చేసుకుంటున్నారు. ఆ తర్వాత అందులో ఇమడలేక నిరాశ, ఒత్తిడి, ఒంటరితనానికి గురవుతున్నారు. తమ జీవితంపై నియంత్రణ కోల్పోయి ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతున్నారు. ముఖ్యంగా మహిళలు గృహ హింసకు గురవుతున్న సందర్భాలు అనేకం. విడాకులు తీసుకోవడం తీవ్ర కష్టతరం కావడం, సమాజం ఏముంటుందోననే భావించి.. ఆ వివాహ బంధం నుంచి బయటపడలేక ఆందోళనకు గురవుతున్నారు. ఆ వివాహ బంధం నుంచి ఎలాగైనా బయటపడాలనే ఆతృతతో కొన్ని సార్లు కఠిన నిర్ణయాలు తీసుకొని నేరస్తులుగా మిగిలిపోతున్నారు. భారతదేశంలో విడాకుల ప్రక్రియలో అనేక సంక్లిష్టతలు ఉన్నాయి. పెండ్లి లాగే విడాకులు కూడా ఒక సుదీర్ఘమైన, సంక్లిష్టమైన, ఖర్చుతో కూడుకున్న ప్రక్రియగా మారింది. ఇది విడిపోవాలనుకునే వారికి తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నది. అంతేకాకుండా విడాకులు తీసుకున్న మహిళలను సమాజం ఇప్పటికీ చిన్నచూపు చూస్తున్నది. విడాకుల తర్వాత మహిళలు ఒంటరితం, ఆర్థిక అస్థిరతను ఎదుర్కొంటున్నారు. మహిళలు విడాకులు ఇచ్చిన పురుషులను సైతం చాలా మంది చిన్నచూపు చూస్తున్నారు. అంతేకాకుండా భరణం చెల్లించాల్సి వస్తుందనే కారణంతో భార్యలను పురుషులు హత్యలు చేస్తున్నారని కొన్ని నివేదికలు సూచిస్తున్నాయి. 2022 డేటా ప్రకారం భారతదేశంలో విడాకుల రేటు ప్రతి వెయ్యి మందికి 0.01 (వెయ్యి మందికి ఒకరు) మాత్రమే. 2020లో ఇది 0.022 ఉండగా, 2021లో 0.077 మాత్రమే ఉన్నది. అయితే, ఇటీవలి సంవత్సరాల్లో, ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో విడాకుల రేటు మెల్లమెల్లగా పెరుగుతున్నది. అయితే ఇతర దేశాలతో పోల్చుకుంటే ఈ శాతం చాలా తక్కువ. అయితే ఒక నివేదిక ప్రకారం 2023 వరకు దేశంలో సుమారు ఏడు లక్షలకు పైగా విడాకుల కేసులు వివిధ కోర్టుల్లో పెండింగులో ఉన్నాయి. విడాకుల ప్రక్రియ సుదీర్ఘమైనది, ఖర్చుతో కూడుకున్నది కావడంతో.. ఈ జాప్యం వివాదాలను తీవ్రతరం చేసి హత్యల వరకు తీసుకెళ్తున్నదనే అభిప్రాయం సైతం వ్యక్తమవుతున్నది. దేశంలో జీవిత భాగస్వాముల హత్యలు తీవ్ర ఆందోళనను కలిగిస్తున్నాయి. వీటి నివారణకు కేంద్రంతోపాటు ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాల్సిన అవసరమున్నది. సమాజంలో మార్పు వస్తేనే ఈ హత్యల నివారణ సాధ్యమవుతుంది. ఒత్తిడితో కూడిన వివాహాలు భారతదేశంలో చట్టవిరుద్ధం. అయినా ఇది దేశంలో అమలు కావడం లేదు. ఇద్దరి సమ్మతి ఉంటేనే పెళ్లి చేయాలి. అబ్బాయి, అమ్మాయిల నిర్ణయాలను వారికుటుంబ సభ్యులు గౌరవించాలి. తమ అభిప్రాయాలను చెప్పుకునే స్వేచ్ఛ వారికి ఇవ్వాలి. వైవాహిక సంఘర్షణలు, ఒత్తిడి, లేదా హింసాత్మక ధోరణులను నివారించడానికి జంటలకు మానసిక ఆరోగ్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలి. వివాహ బంధం నుంచి బయటకు వెళ్లిపోయినా.. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా పథకాలను అమలు చేయాలి. పెళ్లి చేయడానికి అయ్యే ఖర్చును భారీగా తగ్గించాలి. రిజిస్టర్డ్ మ్యారేజెస్ ను ప్రోత్సహించాలి. అంతేకాకుండా వివాహ బంధంలో ఇమడలేమని భావిస్తే.. ఆ బంధం నుంచి బయటపడేలా విడాకుల ప్రక్రియను సైతం సులభతరం చేయాలి. ముఖ్యంగా మహిళల కోసం, లీగల్ ఎయిడ్ సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావాలి. ఉచిత లేదా తక్కువ ఖర్చుతో కూడిన న్యాయ సహాయం అందించాలి. విడాకులను ఒక వైఫల్యంగా చూడడం కంటే.. ఒక వ్యక్తి స్వాతంత్ర్యం, ఆరోగ్యకరమైన జీవితానికి అవసరమైన ఎంపికగా సమాజంలో ప్రచారం చేయాలి.

# పౌరసత్వ రుజువు చూపినప్పటికీ నలుగురు భారతీయులను బంగ్లాదేశ్‌కు పంపించిన బీఎస్ఎఫ్



న్యూఢిల్లీ: భారత పౌరులు అయినప్పటికీ పశ్చిమ బెంగాల్‌కు చెందిన నలుగురిని భారత అధికారులు బంగ్లాదేశ్‌కు పంపారు. వారిని పశ్చిమ బెంగాల్ పోలీసులు సోమవారం(జూన్ 16)స్వదేశానికి తిరిగి తీసుకువచ్చారు. వీరిలో ముర్షిదాబాద్ జిల్లాకు చెందిన ముగ్గురు శాశ్వత నివాసితులు, మరొకరు బర్ధమాన్ నివాసి ఉన్నారు. అక్రమ బంగ్లాదేశీయులు అనే అనుమానంతో ఈ వ్యక్తులను మహారాష్ట్ర పోలీసులు ఇటీవల అదుపులోకి తీసుకున్నారు. ఆ తరువాత వారిని సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్)కు అప్పగించారు. వారిని సరిహద్దు దాటించి బంగ్లాదేశ్‌కు పంపారు. సోమవారం ఈ విషయం మీద స్పందిస్తూ ముర్షిదాబాద్ పోలీసులు మాట్లాడారు. నలుగురు వ్యక్తుల భారతీయ పౌరసత్వాన్ని నిర్ధారించడానికి స్థానికంగా దర్యాప్తు నిర్వహించామని పోలీసులు తెలియజేశారు. ధృవీకరణ తర్వాత, సంబంధిత పత్రాలు, పౌరసత్వ రుజువును బీఎస్ఎఫ్‌కు అప్పగించామని చెప్పుకొచ్చారు. "బీజీబీ(బోర్డర్ గార్డ్ బంగ్లాదేశ్)తో బీఎస్ఎఫ్ వెంటనే ఫ్లాగ్ మీటింగ్ నిర్వహించింది. చివరకు బంగ్లాదేశ్ నుంచి నలుగురిని అధికారులు భారతదేశానికి తీసుకువచ్చారు. కొన్ని గంటల క్రితం భారత సరిహద్దులోని కూచ్‌బిహార్ పోలీసులకు అప్పగించారు. వారిని తిరిగి తీసుకురావడానికి ముర్షిదాబాద్ జిల్లా పోలీసుల బృందాన్ని పంపారు. రేపటి నాటికి నలుగురు వ్యక్తులు సురక్షితంగా ఇంటికి తిరిగి వస్తారు" అని ముర్షిదాబాద్ పోలీసులు పేర్కొన్నారు. తిరిగి తీసుకువచ్చిన నలుగురిని మెహబూబ్ షేక్, నజీముద్దీన్ మండల్, మినారుల్ షేక్, ముస్తఫా కమల్ షేక్‌గా గుర్తించారు. దీనికంటే ముందు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఓ కథనాన్ని ప్రచురించింది. దాని ప్రకారం, నలుగురిలో ఒకరైన 36 ఏళ్ల మెహబూబ్ షేక్ పౌరసత్వ రుజువును వలస సంక్షేమ బోర్డు ఇంకా పశ్చిమ బెంగాల్ పోలీసులు సమర్పించారు. అయినప్పటికీ, మహారాష్ట్ర పోలీసులు అతన్ని అప్పగించిన తర్వాత బీఎస్ఎఫ్ అతన్ని బంగ్లాదేశ్‌కు పంపించింది. షేక్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ కుటుంబం పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ముర్షిదాబాద్ జిల్లాలోని భాగబంగోలాలోని మహిసస్థలి గ్రామ పంచాయతీ ప్రాంతంలోని హుస్సేన్ నగర్ గ్రామంలో నివసిస్తున్నారు.

**'వారు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి తెలియజేయడానికి కూడా ఇష్టపడలేదు'**

పశ్చిమ బెంగాల్ వలస సంక్షేమ బోర్డు చైర్మన్ సమీరుల్ ఇస్లాం మాట్లాడుతూ, "షేక్ కుటుంబం మమ్మల్ని సంప్రదించింది. ఆ తర్వాత మేము మహారాష్ట్ర పోలీసులను సంప్రదించాము. అవసరమైన అన్ని పత్రాలను వారికి పంపాము. వారు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి తెలియజేయడానికి కూడా ఇష్టపడలేదు. షేక్‌ను బీఎస్ఎఫ్ బంగ్లాదేశ్‌కు పంపించారు" అని అన్నారు. షేక్ సోదరుడు ముజిబుర్ వార్తాపత్రికతో మాట్లాడుతూ, అతను గత రెండు సంవత్సరాలుగా మహారాష్ట్రలో పనిచేస్తున్నాడని చెప్పాడు. ముజిబుర్ మాట్లాడుతూ, తను టీ తాగుతుండగా, పోలీసులు బంగ్లాదేశీయుడనే అనుమానంతో తనను పట్టుకుని కనకియా పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారని అన్నాడు. షేక్ ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, తరతరాలుగా పంచాయతీ ధృవీకరించిన అతని కుటుంబ వంశావళితో సహా అన్ని పత్రాలను మహారాష్ట్ర పోలీసులకు పంపినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శనివారం(జూన్ 14) షేక్ తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేశాడు. తెల్లవారుజామున 3.30 గంటలకు బీఎస్ఎఫ్ తనను బంగ్లాదేశ్‌కు పంపిందని తెలియజేశాడు. "శనివారం తెల్లవారుజామున 3.30 గంటల ప్రాంతంలో తనను బీఎస్ఎఫ్ బంగ్లాదేశ్‌కు పంపించిందని అతను చెప్పాడు. అతను ఫోన్ చేసిన గ్రామంలో ఆశ్రయం పొందాడు. అతను ఏడుస్తున్నాడు" అని అతని సోదరుడు ముజిబుర్ చెప్పాడు.

**తమను తాము సమర్థించుకున్న మహారాష్ట్ర పోలీసులు..**

తమ చర్యను సమర్థించుకుంటూ షేక్ తన జాతీయతను నిరూపించుకోవడానికి పత్రాలను సమర్పించడంలో "విఫలమయ్యారని" మహారాష్ట్ర పోలీసులు అన్నారు. దీంతోపాటు, పౌరసత్వాన్ని నిరూపించుకోవడానికి అతను ఆధార్, పాన్ కార్డులపై ఆధారపడలేదని తెలియజేశారు. గమనించాల్సిన విషయం ఏంటంటే, పహల్గాం ఉగ్రవాదదాడి తర్వాత భారతదేశ 'పుష్ బ్యాక్' వ్యూహంలో భాగంగా వందలాది మంది అనుమానిత అక్రమ వలసదారులను తూర్పు సరిహద్దు ద్వారా బంగ్లాదేశ్‌కు పంపించారు. దేశవ్యాప్తంగా పోలీసులు అక్రమ వలసదారులను గుర్తించడానికి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో, దీనికంటే ముందు బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రిత్వ శాఖ మే 8న భారతదేశానికి ఒక లేఖ పంపింది. అందులో తమ దేశంలోకి ప్రజలను ఈ విధంగా నెట్టడంపై ఆందోళన వ్యక్తం చేసింది. అంతేకాకుండా, భారత ప్రభుత్వం డిపోర్టేషన్ విధానాలను అనుసరించడంపై మండిపడింది.

# ఒప్పుకుంటే తప్పా?



న్యూఢిల్లీ,"ఆపరేషన్ సిందూర్"లో మనం విజయం సాధించాం. అందులో సందేహం లేదు. కానీ ఏం పొందాం? ఏం పోగొట్టుకున్నాం? అనేది మాత్రం తెలియరావటం లేదు. జీవితమంటేనే కొంత గెలవడం, కొంత కోల్పోవడం అంటారు. అలాటిది యుద్ధమన్నాక ఎంతోకొంత నష్టం వుంటుందని ఎవరైనా ఊహిస్తారు. నష్టం ఎలా జరిగింది, ఎవర్ని బాధ్యులను చేయాలి, ఏ మెటీరియల్‌ని మార్చాలి అనేవి మిలటరీ అంతర్గత విషయాలు. పూర్తి సాంకేతిక విషయాలు. అవి బయటకు రానక్కరలేదు. కానీ స్థూలంగా యిన్ని విమానాలు పోయాయి, ఇన్ని ఓడలు దెబ్బ తిన్నాయి, యింతమంది పోయారు.. అనే అంకెలు విడుదల చేస్తాయి ప్రభుత్వాలు. ఇవి చెపుతూనే మనకు ఒనగూడిన లాభాలతో పోలిస్తే యివి పెద్ద లెక్క కాదు, శత్రువుకి యింకా ఎక్కువ నష్టాలు కలిగాయి అని చేరుస్తారు. మన ప్రభుత్వాలు అలాగే చేస్తూ వచ్చాయి. ఈసారి మాత్రం ప్రభుత్వం ఎందుకో కానీ గోప్యత పాటిస్తోంది. అవసరమా అనే సందేహం వస్తోంది. ఈ సందేహం మీకూ, నాకే కాదు, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్‌కు కూడా కలిగినట్లుంది. అందుకని ఆయన మే 31న సింగపూరులో ఒక విదేశీ మీడియాకు యింటర్వ్యూ యిస్తూ తొలి దశలో "మే 7న మాకు నష్టాలు జరిగాయి. వెంటనే సవరించుకుని, శత్రువులపై విరుచుకు పడి విజయం సాధించాం." అన్నారు. అంతకు ముందు మే 11 సమావేశంలో ఎయిర్ మార్షల్ ఎకె భారతి, ప్రెస్ మీట్‌లో 'కంబాట్ సినారియోలో నష్టాలనేవి ఒక భాగం. అంతిమంగా విజయం సాధించారా లేదా అనే మీరడగాలి. ప్రసుత్తం యుద్ధం నడుస్తోంది కాబట్టి యింతకంటె వివరాలు అడగవద్దు." అంటూ చెప్పారు. యుద్ధం ముగిసిన 20 రోజులకు యీయన దాన్ని మరి కాస్త స్పష్టంగా నష్టాలు జరిగాయి అని చెప్పారు. అయితే ఎన్ని, ఏమిటి అనేది చెప్పటం లేదు. అది పెద్ద యింపార్టెంట్ కాదంటున్నారు. ఇక్కడ రఫేల్ విమానాలు కూలాయా, మరోటి కూలాయా అన్న సంగతి పక్కన పెట్టండి. వాటిని నడుపుతూ దేశసేవలో అమరులైన పైలట్లను మరణానంతర ఎవార్డులతో సత్కరించు కోవలసిన బాధ్యత మనపై వుంది కదా. (పైలట్లు అందరూ సురక్షితంగా తిరిగి వచ్చారంటున్నారు. ఇదెలా సాధ్యమో నాకు అర్థం కావటం లేదు) ఈ సమాచారం దాచేసి, వారి త్యాగాలను విస్మరిస్తే న్యాయం కాదు కదా! పాకిస్తాన్ వారు మన ఫైటర్ జెట్ విమానాలు ఆరిటిని (ఫ్రాన్స్ వారి రఫేల్ 3, రష్యా వారి మిగ్‌లు 2, మరొకటి) కూల్చి వేశామని చెప్పుకుంటూ వుంటే, దాన్ని ఖండిస్తూ ప్రభుత్వం తరఫు నుంచి ప్రకటన రాకుండా యీయన యిలా చెప్పడమేమిటి, అందునా విదేశీ గడ్డపై చెప్పడమేమిటి అనే విమర్శ వస్తోంది. ఒక మిలటరీ అధికారికి ఆ పాటి క్రమశిక్షణ వుండదా? ఒకవేళ ఆయన హద్దు మీరి వుంటే, ప్రభుత్వం చర్యలు తీసుకునేదిగా! లేక ప్రభుత్వమే ఆయన చేత యిలా చెప్పించిందా? ఇంతవరకే చెప్పించి, తర్వాతది చెప్పించక పోవడంలో ఆంతర్యమేమిటి? ప్రభుత్వం ఏదో దాచుదామని చూస్తోంది. ముఖ్యంగా కూలినవి రఫేల్‌వి అనే ఆరోపణ వస్తున్నపుడు ఔననో, కాదనో చెప్పాలి కదా. దసో కంపెనీ ప్రతినిధి, 'మావి కూలాయని అనడానికి లేదు. అనిల్ చౌహాన్ అలా అని వివరంగా చెప్పలేదుగా' అన్నాడు. 15 రోజుల క్రితం సిఎన్ఎన్‌లో ఒక ఫ్రెంచ్ యింటెలిజెన్స్ అధికారి ఒక రఫేల్ కూలిందని చెప్పాడని రాసింది. రాయిటర్స్ తమకు అమెరికన్ యింటెలిజెన్స్ అధికారులిద్దరు అదే చెప్పారని రాసింది. చైనా నుంచి పాక్ కొన్న జె – 35 విమానాలతో అది సాధించిందని మరి కొందరు రాశారు. వీటన్నిటితో జె –35 తయారు చేసే కంపెనీ స్టాక్స్ విలువ రెండు రోజుల్లో 40% పెరగ్గా, దసో స్టాక్స్ 10% తగ్గాయి. ఇప్పుడు దసో కంపెనీ భారతదేశం కన్‌ఫమ్ చేసేవరకు మావి కూలాయని ఒప్పుకోం అంటోంది. చౌహాన్ గారి అర్ధోక్తిని ఎవరికి కావలసినట్లు వాళ్లు వాడుకుంటున్నారు! అనిల్ చౌహాన్ నిర్వహిస్తున్న పదవి చాలా బాధ్యతాయుతమైనది. మోదీ ప్రభుత్వం ఐదేళ్ల క్రితం సృష్టించిన పదవి అది. మిలటరీ కమాండ్స్ యివ్వకపోయినా త్రిదళాధిపతుల కంటె పైన వుండే పోస్టు. అనిల్ ఆ పోస్టులోకి 2022 సెప్టెంబరులో వచ్చారు. ఆర్మీలో వుండగా పరమ విశిష్ట సేవా మెడల్, ఉత్తమ్ యుధ్ సేవా మెడల్ వంటి అనేక సత్కారాలు పొంది 2021 అక్టోబరులో రిటైరై 2022 సెప్టెంబరు వరకు నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటేరియట్‌కి మిలటరీ ఎడ్వయిజర్‌గా పని చేశారు. ఇలాటి ప్రధాన వ్యక్తి పాక్ వాళ్లు చెప్పేది అబద్ధం అంటాడు తప్ప నిజమేమిటో చెప్పడు. ఎన్ని కూలిపోయాయన్నది ముఖ్యం కాదు, ఎందుకు కూలాయన్నది కీలకం అన్నాడు. ఎందుకు కూలాయన్నది ప్రజలకు చెప్పడం అనవసరం. చెప్పినా వాళ్లకు అర్థం కాదు. ఇప్పుడు ఎయిర్ ఇండియా విమానం ఎందుకు కూలిందో చెప్తున్న సాంకేతిక విషయాలు మనకు ఎంతవరకు వంటబడతాయి? ఎన్ని యుద్ధవిమానాలు కూలాయన్నది మాత్రం ముఖ్యమే. ఫుట్‌బాల్ మ్యాచ్ గెలిచాం అంటే మీరెన్ని గోల్స్ తేడాతో కొట్టారు? అని అడక్కుండా వుంటారా? అవతలివాళ్లను ఎంత తక్కువ కొట్టనిస్తే అంత గొప్ప కదా! అంతర్జాతీయ మీడియా ప్రకారం ఇండియా 3 రఫేల్, 1 సుఖోయ్, 1 మిగ్ కోల్పోయింది. కాంగ్రెసు పాలిట బోఫోర్స్ ఎలాగో, బిజెపి పాలిట రఫేల్ అలా తయారైంది. అందుకని అవి కూలిపోయాయని ఒప్పుకోవడం తమకు మచ్చ తెస్తుందని భయపడి బిజెపి ప్రభుత్వం వాస్తవాలు చెప్పటం లేదా? అన్న సందేహం కలుగుతోంది. దాన్ని సత్వరంగా నివారించ వలసిన బాధ్యత కేంద్రానిదే! ప్రజల విశ్వాసమే పాలకులకు బలం. గోప్యత పాటించిన కొద్దీ సందేహాలు మరింత పెరుగుతాయి. ఇక్కడ రఫేల్ కూలిందా, మిగ్ కూలిందా అన్నది నా దృష్టిలో పెద్ద విషయం కాదు. ప్రతిష్ఠాత్మక బోయింగ్ విమానం సైతం అహ్మదాబాద్‌లో కూలింది. ఇక్కడ మనం ఉలిక్కిపడవలసినది పాక్–చైనా సైనిక బంధం గురించి. మన యుద్ధ విమానాలు %–% ఎన్నయితే అన్ని %–% కూల్చినవి చైనా విమానాలు. గత 40 ఏళ్లగా స్వయంగా ఏ వైమానిక యుద్ధమూ చేయని చైనా యింత శక్తివంతమైన యుద్ధవిమానాలు చేయగలిగిందన్నది, వాటిని పాక్‌కు అమ్మిందన్నది మనం గుర్తించాలి. పాక్ డిఫెన్స్–అఫెన్స్ వ్యూహంలో చైనీస్ జె–10, చైనీస్ మిస్సయిళు (పిఎల్ 15) పాల్గొన్నాయి. పైలట్లు పాక్ వారే, విమానాలు చైనావి. 'సైనిక వ్యూహాలు కూడా చైనా వారివే, చైనీస్ సైనిక ఉపగ్రహాలు, చైనీస్ ఏఐ పాటవం కూడా ఉపయోగించారు. ఒకలా చెప్పాలంటే చైనా తన ఆయుధ వ్యవస్థల శక్తిసామర్థ్యాలను పరీక్షించుకోవడానికి ఈ ఇండో–పాక్ యుద్ధాన్ని వినియోగించుకుంది.' అని మాజీ కేంద్ర మంత్రి చిదంబరం ఒక వ్యాసంలో రాశారు. పాక్‌పై చైనాకి ఎందుకింత ప్రేమ? అనే దానికి నాకు సమాధానం 270525 నాటి "హిందూ"లో దొరికింది. దాని ప్రకారం ఆపరేషన్ సిందూర్‌లో భారత్ స్వదేశీ ఆయుధాలతో పాటు ఇజ్రాయేల్ (స్ట్రైయిక్ డ్రోన్), రష్యా (పెచోరా, ఒఎస్ఏ–ఎకె మిస్సయిళ్లు) వాడింది. పాక్ చైనా వారి పిఎల్–15 మిస్సయిళ్లు, టర్కీ వారి ఏరియల్ వెహికిల్స్ వాడింది. ఇండియా తన ఆయుధాలలో 33% యుఎస్ఎస్ఆర్ నుంచి దిగుమతి చేసుకునేది. 1990లు వచ్చేసరికి అది 96.5% కు చేరింది. సోవియట్ రష్యా విచ్ఛిన్నమయ్యాక అది క్రమేపీ తగ్గి 2020ల నాటికి 75% కు చేరింది. రష్యాకు బదులుగా ఇండియా ఫ్రాన్స్ (9%), యుకె (5.5%), ఇజ్రాయేల్ (5%) అమెరికా (3%) ల నుంచి కొనుగోలు చేయసాగింది. ఇక పాకిస్తాన్ విషయానికి వస్తే, అది దశాబ్దాలుగా అమెరికా, చైనాల నుంచి కొనుగోలు చేస్తూ వచ్చింది కానీ యిటీవల అమెరికా దిగుమతి తగ్గించేసి చైనాది పెంచేస్తూ వచ్చింది. 2000ల్లో చైనాది 19% వుంటే, 2010ల్లో 41%కు, 2020ల నాటికి 95% పెరిగింది. అమెరికా వాటా 1950ల్లో 80% వుండేది, 1980ల నాటికి 60% అయింది. 2000ల్లో 67% వుంటే, 2010ల్లో 38% కు, 2020ల్లో 0.9% కు తగ్గిపోయింది. ఆయుధాల విషయమే కాదు, చైనాకు పాక్‌తో వున్న 'ఋణానుబంధం' కూడా పరిగణనలోకి తీసుకోవాలి. పాక్ ఒక్కటే కాదు, ఆసియా దేశాలన్నిటినీ చైనా తన ఋణవలయంలో ఎలా బిగిస్తోందో వేరే ఆర్టికల్‌లో రాస్తాను. ఆపరేషన్ సిందూర్ వివాదం యుద్ధ విమానాల చుట్టూ తిరుగుతోంది కాబట్టి ఆయుధాల్లో

# జూబ్లీహిల్స్‌కు ఇప్పుడే ఉపఎన్నిక ఉండకపోవచ్చు

హైదరాబాద్, హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ఇప్పట్లో నోటిఫికేషన్ ఉండకపోవచ్చని, రెండు, మూడు రాష్ట్రాల్లో ఖాళీ అయిన అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికల నోటిఫికేషన్ ఇప్పటికే వచ్చిందని సీఈఓ సుదర్శన్ రెడ్డి తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నోటిఫికేషన్ ఇప్పుడే ఉండకపోవచ్చని తెలిపారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు అసెంబ్లీ తమకు గెజిట్ పంపించిందని గుర్తుచేశారు. ఆ గెజిట్ తాము యథాతథంగా కేంద్ర ఎన్నికల సంఘానికి పంపించామని అన్నారు. జూబ్లీహిల్స్‌లో డిసెంబర్ వరకు కొత్త ఎమ్మెల్యే ఎన్నిక జరగాలని సీఈవో సుదర్శన్ రెడ్డి తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం చాలా సంస్కరణలను తీసుకువస్తోందని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. బూత్ లెవెల్ ఏజెంట్స్, ఈఆర్‌ఓలతో ఇంటరాక్ట్ కార్యక్రమాలు చేపడుతోందని అన్నారు. వీరికి ట్రైనింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తోందని వివరించారు. పోలింగ్ స్టేషన్‌లలో మినిమం ఓటర్ల సంఖ్యను 1200కు కుదించిందని గుర్తుచేశారు. పోలింగ్ కేంద్రం వద్ద ఆంక్షలను 200 మీటర్ల నుంచి కిలో మీటర్ వరకు పెంచిందని వెల్లడించారు సీఈఓ సుదర్శన్ రెడ్డి. పోలింగ్ కేంద్రానికి కిలోమీటర్ వరకు పార్టీలు ప్రచారం చేయడానికి వీలు లేదని సీఈఓ సుదర్శన్ రెడ్డి అన్నారు. పోలింగ్ సెంటర్స్ వద్ద ఇక నుంచి మొబైల్ ఫోన్స్ కోసం డిపాజిట్ ఫెసిలిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈనెల(జూన్) 26, 27 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర ఃఒం, ఃఒక్షలకు ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం ట్రైనింగ్ ఇస్తోందని చెప్పారు. నేషనల్ లెవెల్ లీగల్ కాన్ఫరెన్స్ కోసం ముగ్గురు న్యాయవాదులకు శిక్షణ ఇస్తోందని అన్నారు. రూరల్‌లో 87శాతం, అర్బన్‌లో 67శాతం ఓటర్, ఆధార్ కార్డ్ లింక్ జరిగిందని సీఈఓ సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు.

# అక్రమంగా అమ్ముతున్న డిఫెన్స్ మద్యం పట్టివేత

హైదరాబాద్,హైదరాబాద్ నగరంలో డిఫెన్స్ మద్యం పట్టుబడింది. మల్కాజిగిరిలో 37 బాటిళ్లు, మేడ్చల్ లో 24 బాటిళ్ల మద్యంను అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎక్స్ ఆర్మీ పర్సన్ ను అరెస్ట్ చేశారు. ఎక్స్ ఆర్మీకి చెందినటువంటి ఇద్దరూ వ్యక్తులు రెండు చోట్ల మద్యం అమ్మకాలు జరుపుతున్నారు అనే సమాచారం మేరకు మల్కాజిగిరి ఏఈఎస్ ముకుంద రెడ్డి బృందం రెండుచోట్ల దాడి చేసి 37 డిఫెన్స్ మద్యం బాటిల్లను సీజ్ చేశారు. పట్టుబడినటువంటి మద్యం బాటిళ్లు కర్ణాటక చెందినవిగా గుర్తించారు. డిఫెన్స్ క్యాంటీన్ లో నెలవారీగా వచ్చే కోటాను కొంతమంది వద్ద బాటిల్లను కొనుగోలు చేసి ఎక్స్ సర్వీస్ మెన్ పురుషోత్తం యాప్రాల్ లో, ముప్పరపు సిద్దయ్య ఆర్మీ పర్సనల్ కౌకూర్ లో అమ్మకాలు జరుపుతుండగా పట్టుకున్నట్లు ఏ ఎస్ బి ముకుంద రెడ్డి తెలిపారు. పట్టుకున్న మద్యం విలువ రూ. 75 వేలుగా ఉంటుందని అంచనా వేశారు. మద్యం బాటిల్స్ పట్టుకున్న వారిలో ఏఈఎస్ ముకుంద రెడ్డితో పాటు సీఐ భరత భూషణ్ డిటిఎఫ్ ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాస్ రెడ్డిలు సిబ్బంది ఉన్నారు. మద్యం బాటిల్ పట్టుకున్నటువంటి సిబ్బందిని ఎక్సైజ్ సూపరిండెంట్ నవీన్ అభినందించారు. మేడ్చల్ ఈఎస్ పరిధిలో హర్యానాతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చేటువంటి లేబర్ వారు తీసుకొచ్చుకునేటువంటి మద్యం బాటిల్లను మేడ్చల్ సిఐ నవనీత ఏఈ ఎస్ మాధవయ్య డిటిఎఫ్ నర్సిరెడ్డిలు సిబ్బంది కలిసి వాహనాలు, బస్సులు నిలిపే ప్రాంతాల్లో తనిఖీలు చేసి 24 మద్యం బాటిల్లను సీజ్ చేసినట్లు మేడ్చల్ ఎక్సైజ్ సిఐ నవనీత తెలిపారు. పట్టుకున్న మద్యం బాటిల్లో విలువ రూ. 48 వేలుగా ఉంటుందని అంచనా వేశారు. మద్యం బాటిల్లను పట్టుకున్నటువంటి సిబ్బందిని సిఐని ఎక్సైజ్ సూపర్ రేటెండెంట్ ఎస్.కె ఫయాజుద్దీన్ అభినందించారు.

# తాటతీస్తానన్న పవన్ ఎక్కడున్నాడు

విశాఖపట్టణం, రాష్ట్రంలో మహిళలపై దారుణాలు జరుగుతుంటే తాట తీస్తా.. తోలు తీస్తానన్న పవన్ కళ్యాణ్ ఏమయ్యారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ప్రశ్నించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్త ఓ మహిళను నడిరోడ్డుపై అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా రోడ్డుపై ఈడ్చుకెళ్లి.. చెట్టుకు తాళ్లతో కట్టేసి చిత్రహింసలకు గురి చేశాడు. ఆ ఘటనపై వరుదు కల్యాణి మీడియాతో మాట్లాడారు. మహిళలు, బాలికలపై వరుస అఘాయిత్యాలు జరుగుతున్నాయి. విశాఖలో టీడీడీపీ కార్యకర్త మహిళను వివస్త్ర చేసి దాడి చేసినా పట్టించుకోలేదు. సత్యసాయి జిల్లాలో బాలికపై లైంగికదాడికి పాల్పడింది టీడీపీ వాళ్లే. నిందితులు అధికార టీడీపీకి చెందిన వాళ్లే కావడంతో ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. రాష్ట్రంలో భయంకరమైన సంఘటనలు జరుగుతున్నాయి. మహిళలపై ఎవరైనా చేయివేస్తే తాట తీస్తానన్న పవన్ ఎక్కడున్నారు? మహిళల భద్రతను గాలికొదిలేశారు. హోంమంత్రి అనిత ఏం చేస్తున్నారు?. రెడ్‌బుక్ రాజ్యాంగానికి ఇచ్చిన ప్రాధాన్యత మహిళల భద్రతకు ఇవ్వడం లేదని వ్యాఖ్యానించారు.

# సైలెంట్ మోడ్

అమరావతి,రాష్ట్రంలో పాతిక మంది వరకు జనసేన–భాజపా ప్రజా ప్రతినిధులు వున్నారు. వీరి నుంచి ఎంపికైన మంత్రులు వున్నారు. వీరి యాక్టివిటీ ఏమైనా నిత్యం పత్రికల్లో కనిపిస్తోంది. ఎమ్మెల్యే కావచ్చు, ఎంపీ కావచ్చు, మంత్రులు కావచ్చు. వీళ్ల నిత్య కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారాలు, లేదా అఫీషియల్ మీటింగ్ లు, ఇంకా ఇంకా ఏవైనా సరే పత్రికల్లో కనిపిస్తున్నాయా? తెలుగుదేశం ప్రజా ప్రజా ప్రతినిధుల వార్తలతో పోల్చుకుంటే అస్సలు జనసేన, భాజపా ప్రతినిధులు వున్నారా? అన్నదే అనుమానంగా కనిపించేలా వుంది వ్యవహారం. ప్రజా ప్రతినిధులు అన్నాక నిత్యం ఏదో ఒక వ్యవహారం వుంటూనే వుంటుంది. సమీక్షా సమావేశాలు వుంటాయి. లోకల్ పర్యటనలు వుంటాయి. అధికారులకు ఆదేశాలు వుంటాయి. ఇంకా చాలా వుంటాయి. అదే మంత్రులు అయితే ఫుల్ బిజీగా వుంటారు. మరి ఎందుకు వీరి వీరి వార్తలు ఎక్కడా ఒక్కటి కూడా కనిపించడం లేదు. డిప్యూటీ సిఎమ్ పవన్, కీలక మంత్రి మనోహర్ వార్తలు అప్పుడప్పుడు కనిపిస్తున్నాయి. మిగిలిన వారి వార్తలు అస్సలు లేనే లేవు. మంత్రి సత్య కుమార్ ప్రభుత్వ పాలన ఆరంభంలో కాస్త కనిపించారు. ఇప్పుడు అస్సలు ఆయన వార్తలే కనిపించడం లేదు. పార్లమెంట్ సభ్యుడు సిఎమ్ రమేష్ అన్నిటా తానై కనిపించారు కొత్త ప్రభుత్వం వచ్చిన తొలినాళ్లలో. ఇప్పుడు అస్సలు ఆయన ఎక్కడున్నారో తెలియడం లేదు. ఆయన లోకల్ గా వుండి వుండొచ్చు, ఢిల్లీలో వుండి వుండొచ్చు. కానీ పత్రికల్లో మాత్రం కనిపించడం లేదు. ఇక జనసేన, భాజపా ఎమ్మెల్యేల సంగతి అయితే చెప్పనక్కరలేదు. ఎవరో, ఎక్కడో వార్తలు కనిపించడం లేదు. ఒక్కసారిగా ఓ గ్రూపు ప్రజా ప్రతినిధుల వార్తలు అన్నీ ఒక్కసారిగా మీడియాలో కనిపించకుండా పోవడం ఏమిటి?

# ఇండిగో విమానానికి బాంబ్ బెదరింపు

ముంబై,విమానాల్లో సాంకేతిక సమస్యలు, బాంబు బెదిరింపులు ఇటీవలే కాలంలో ఆందోళన కలిగిస్తున్నాయి. గతవారం అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం అనంతరం ఇలాంటి ఘటనలు అనేకం వెలుగు చూస్తున్నాయి. తాజాగా కేరళ రాష్ట్రం కొచ్చి నుంచి దేశ రాజధాని ఢిల్లీ వెళ్తున్న ఓ ఇండిగో విమానానికి బాంబు బెదిరింపులు వచ్చాయి. ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు చెందిన 6ఇ 2706 విమానం మస్కట్ నుంచి కొచ్చి మీదుగా ఢిల్లీ వెళ్తోంది. అయితే, విమానంలో బాంబు ఉందంటూ బెదిరింపు కాల్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన పైలట్ వెంటనే విమానాన్ని నాగ్‌పూర్‌ఎయిర్‌పోర్ట్‌లో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. అక్కడ ప్రయాణికులందరినీ కిందకు దింపి.. తనిఖీలు నిర్వహించారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సాయంతో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువులూ లభించలేదని నాగ్‌పూర్ డీసీపీ లోహిత్ మతాని తెలిపారు.

# గోదావరి మిగులు జలాలతో బనకచర్ల

అమరావతి, గోదావరి వరదల వల్ల ఎపికే ఎక్కువ నష్టం అని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పర్యావరణ అనుమతుల కోసమే కేంద్రానికి లేఖ రాశాం అని అన్నారు. ఈ సందర్భంగా నిమ్మల మీడియాతో మాట్లాడుతూ.. వరదల వల్ల నష్టపోతున్న ఎపికి.. నీళ్లు ఉపయోగించుకునే హక్కుఉందని చెప్పారు. గోదావరి నీళ్లు నిరుపయోగంగా సముద్రంలో కలుస్తున్నాయని, ఎగువ నీటి అవసరాలు తీరిన తర్వాతే బనకచర్లకు నీళ్లు వృథాగా పోతున్నాయని ఆ నీళ్లనే బనకచర్లకు వాడుకుంటాం అని తెలియజేశారు. రాజకీయ లబ్ది కోసమే బనకచర్లపై వైసిపి విమర్శలు చేస్తుందని మండిపడ్డారు. ప్రాజెక్టుతో ఎగువ రాష్ట్రాలకు నష్టం లేదని అన్నారు. బనకచర్లపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారని, ప్రాజెక్టుపై అనుమానాలు అవసరం లేదు అని నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు వల్ల ఎగువ రాష్ట్రాలకు ఎలాంటి నష్టం లేదని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఈ ప్రాజెక్టుపై ఆయన సచివాలయంలో పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఏటా గోదావరి నుంచి 3 వేల టీఎంసీలు వృథాగా సముద్రంలోకి పోతున్నాయని ఆయన వివరించారు. 'ప్రపంచంలోనే ఒక నదిలో ఒకే సమయంలో 50 లక్షల క్యూసెక్కులు ప్రవహించే నది గోదావరి. పోలవరం వద్ద లభ్యమయ్యే గోదావరి వరద జలాలను మాత్రమే ఉపయోగించుకుంటాం. వృథాగా సముద్రంలోకి పోయే నీటిని మాత్రమే బనకచర్లకు తరలిస్తాం. ఎక్కడా నికర జలాలను వాడట్లేదని స్పష్టంగా చెబుతున్నాం. ఎగువ రాష్ట్రాలకు కేటాయించిన నీటిని వాడుకునే పరిస్థితి లేదని ఆయన వెల్లడించారు. బనకచర్ల ప్రాజెక్టుపై వాస్తవాలు ప్రజలకు తెలియాలని, దీనిపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని, గత 50 ఏళ్లుగా గోదావరి నీరు వృథాగా 3000 టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తోందని, ఇందులో 200 టీఎంసీల నీరు ఉపయోగించి బనకచర్లకు తరలించాలనే ఈ ప్రాజెక్ట్ నిర్మాణ ఉద్దేశమని ఏపీ నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మూడు సెగ్మెంట్‌లుగా బనకచర్ల నిర్మాణం జరుగుతుందని, పోలవరం నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు.. ప్రకాశం బ్యారేజీ నుంచి బొల్లాపల్లి రిజర్వాయర్ వరకు.. సెగ్మెంట్ 2: బొల్లాపల్లి నుంచి బనకచర్ల వరకు.. సెగ్మెంట్ 3.. ఇలా మూడు సెగ్మెంట్‌లలో నిర్మాణం జరుగుతుందని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. బనకచర్లపై వస్తున్న ఆరోపణలు కేవలం రాజకీయాల కోసమేనని, సాంకేతిక అంశాల కన్నా రాజకీయంపై దృష్టితోనే ఆరోపణలు చేస్తున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. తెలంగాణలో అంతర్గత రాజకీయలు కోసం బనకచర్లపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఎలాంటి అనుమతి లేకుండా ఏపీ ప్రభుత్వం ముందుకు వెళుతోందని అసత్యాలు చెబుతున్నారని మండిపడ్డారు. అన్ని నియమ నిబంధనల ప్రకారమే అనుమతి తీసుకుని నిర్మాణం జరుగుతుందన్నారు. సీడబ్ల్యూసీకి ఇప్పటికే ప్రాథమిక నివేదిక ఇచ్చామని చెప్పారు. ఆమోదం లేకుండా డీపీఆర్ ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారని, ప్రాథమిక నివేదిక ఆమోదం తెలిపాక డీపీఆర్ ఇస్తామని మంత్రి తెలిపారు. పోలవరం, బనకచర్ల అనుమతులు నిబంధనల ప్రకారమే జరుగుతున్నాయని మరోసారి స్పష్టం చేశారు. ఏపీ జలదోపిడీ అని విమర్శలు చేస్తున్నారని, వరద జలాలు ఉపయోగించు కోవడం తమ హక్కు అని, దిగువ రాష్ట్రం అయిన ఆంధ్రప్రదేశ్ ఎగువ రాష్ట్రాల ప్రయోజనాలు... నీటి అవసరాలు తీరాక మాత్రమే వరద జలాలు ఉపయోగిస్తున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఏ రాష్ట్రానికి ఎలాంటి నష్టం లేదని, ప్రతి ఏడాది 3వేల టీఎంసీల నీరు సముద్రంలోకి పోతోందన్నారు. ఒక ఏడాది 7 వేల టీఎంసీల నీరు సముద్రంలోకి వృథాగా పోయిందన్నారు. ఇంకా వర్షాకాలం పూర్తిగా రాకుండానే సముద్రంలోకి నీరు వృథాగా పోతోందని అన్నారు. కేసీఆర్ చేపట్టిన ప్రాజెక్టులకు సరైన అనుమతి తీసుకోలేదని ఆరోపించారు. పూర్తయిన ప్రాజెక్టులకే అనుమతి లేదని, ఇంకా ప్రారంభ దశలో ఉన్న ప్రాజెక్టుల అనుమతిపై మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రాజెక్టును ఆపాలన్న దురుద్దేశం తమకు లేదని... సీఎం చంద్రబాబుకు అసలే లేదని మంత్రి నిమ్మల స్పష్టం చేశారు. సీతారాం సాగర్ లిఫ్ట్‌కు కూడా మొన్ననే అనుమతి వచ్చిందని, కానీ 75 శాతం పనులు పూర్తయ్యాయని అన్నారు. దేవాదుల ఎత్తి పోతల పథకంతో పాటు చాలా ప్రాజెక్టులకు చంద్రబాబు సహకరించారని, బీమా ఎత్తిపోతల పథకానికి కూడా సహకారం అందించారని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఎస్సారెస్పీతో పాటు అనేక ప్రాజెక్టులకు చంద్రబాబు సహకరించారన్నారు. ఈ విషయాన్ని తెలంగాణా ప్రజలు గుర్తు పెట్టుకోవాలన్నారు. దిగువ రాష్ట్రాలకు ఉన్న హక్కుల ప్రకారం చంద్రబాబు కొన్ని ప్రాజెక్టుల విషయంలో అభిప్రాయం చెప్పారు తప్ప అడ్డుకోవాలని కాదని అన్నారు. అపెక్స్‌లో ఇరు రాష్ట్రాల సీఎంల మాటలు మినిట్స్ రూపంలో ఉన్నాయన్నారు. రెండు రాష్ట్రాలు ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో ఉండాలని చంద్రబాబు చెప్పారని మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్యానించారు.

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన మంత్రి వివేక్

హైదరాబాద్,జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంత్రి వివేక్ వెంకటస్వామి కుటుంబ సమేతంగా మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం రేవంత్ రెడ్డి దంపతులకు వివేక్ వెంకటస్వామి దంపతులు శాలువా కప్పి సత్కరించారు. సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి కేబినెట్‌లో అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎంతో మంత్రి వివేక్ వెంకటస్వామి ముచ్చటించారు. సీఎం కూడా కాకా వెంకటస్వామితో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణతో పలు విషయాలను సీఎం రేవంత్ రెడ్డి పంచుకున్నారు. రాష్ట్ర ఎకానమీకి అత్యంత కీలకమైన మైనింగ్ శాఖ బాధ్యతలను మంత్రి వివేక్ వెంకటస్వామికి సీఎం రేవంత్ రెడ్డి కేటాయించిన సంగతి తెలిసిందే. గనుల ద్వారా రాష్ట్ర ఆదాయాన్ని పెంచడంతో పాటు కార్మికుల సంక్షేమం, ఉపాధి, శిక్షణ కార్యక్రమాల నిర్వహణ లాంటి కీలక బాధ్యతలు ఆయనకు అప్పగించారు. వివేక్‌కు ఉన్న అనుభవం, రాజకీయ నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ శాఖలను కేటాయించారు.

# అప్పులు...కేసులు...దబాయింపులు !

హైదరాబాద్,ఉమ్మడి ఎపి రాష్ట్రాన్ని విడదీసిన తరవాత రెండు తెలుగు రాష్ట్రాల ఏర్పాటు లక్ష్యం నెరవేరిందా అంటే లేదనే చెప్పాలి. ఉమ్మడి ఎపికన్నా దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రం ఏర్పడ్డదే తమ అధికారం కోసం అన్నరీతిలో తెలంగాణలో దాదాపు పదేళ్ల పాటు టిఆర్‌ఎస్ లేదా బిఆర్‌ఎస్ రాజ్యమేలింది. ఐదేళ్లపాటు జగన్ కూడా ఎపిని సర్వనాశనం చేసి, అన్నింటా అవినీతిని జొప్పించారు. ఇలా దోపిడీ రాజ్యం నడిచింది. తెలుగు రాష్ట్రాల్లో దోపిడీని ప్రజలు పట్టించుకోకుండా పందేరాలకోసం పడిగాపులు కాస్తున్నారు. ఇక తెలంగాణలో అయితే ధనిక రాష్ట్రమంటూ అప్పులకుప్పను చేసింది. పథకాల పేరుతో డబ్బులు పందేరం చేసింది. కాళేశ్వరం పేరుతో లక్షకోట్లు గోదాట్లో పోసారు. ఇది పనికిరాని ప్రాజెక్ట్ అంటూ తాజాగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కూడా వ్యాఖ్యానించారు. ఇది వయబుల్ కాదని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ రాష్ట్రానికి ఉపయోగం కన్నా నష్టం ఎక్కువగా కలిగించిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. దీనిపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఈ మేరకు నివేదిక ఇచ్చిందని వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ ఫీజిబిలిటీ లేనిదిగా బీజేపీ గతంలోనే చెప్పిందని, ఇప్పుడు కూడా సీబీఐ విచారణ కోరుతున్నామని తెలిపారు. గత బిఆర్‌ఎస్ పదేళ్ల కాలాన్ని పరిశీలిస్తే అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. కాళేశ్వరం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, గొర్రెల పంపెంకం,చేపల పెంకం, రైతుబంధు, ఈ కార్ రేసు వంటివన్నీ అవినీతికి ఆలవాలంగా ఉన్నాయి. ఇందులో పెట్టిన డబ్బులన్నీ స్వార్థానికి వాడుకున్నారు. కోట్లల్లో అవినీతి జరిగింది. దీనిపై విచారణ కూడా సీరియస్‌గా సాగడం లేదు. ఏడాదిన్నరయినా ఫోన్ ట్యాపింగ్ సహా ఏ కూసూ తేలడం లేదు. ఇవన్నీ మరచిపోయి కెటిఆర్ సవాళ్లు విసురుతున్నారు. హరీష్ రావు విమర్శలు చేస్తున్నారు. కవిత ఒంటికాలు మీద లేస్తున్నారు. మా నాయనకు నోటీసులు ఇస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము తప్ప ఇతరులు పాలనకు పనికిరారన్న రీతిలో వ్యాఖ్యలు చేస్తున్నారు. నిజానికి కేసులు పెడితే ధైర్యంగా ఎదుర్కోవాలి. నిజాయితీ నిరూపించుకోవాలి. కానీ నిగగ్గదీస్తున్నారు. ఫార్ములా ఈ కార్ రేస్ వ్యవహారానికి సంబంధించి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సవాళ్లు విసురుతూ చట్టాన్ని అపహాస్యం చేస్తున్నారు. దమ్ముంటే లై డిటెక్టర్ పరీక్షలకు రావాలని సవాల్ చేస్తున్నారు. సిఎం రేవంత్‌ను లై డిటెక్టర్ పరీక్షకు రావాలని సవాల్ చేయడం ఆయన అసహనాన్ని తెలియచేస్తోంది. కుంభకోణం లేదు..లంబకోసం లేదు..లొట్టపీసు కేసు అంటూ అహంకారాన్ని ప్రదర్శిస్తున్నారు. పదేళ్లపాటు దర్జాగా పాలన సాగించి, దగా చేసిన నేతలు ఇవాళ సవాళ్లు విసరుతున్నారు. సవాళ్లు విసిరితే ఇక చట్టాలు ఎందుకు..? కోర్టులు ఎందుకో చెప్పాలి. ఫార్ములా కార్ రేసులో తప్పు చేయలేదని అంటున్నారు. తప్పు చేయకపోతే...నేరుగా 55 కోట్లు ఎందుకు తరలించారన్నదానికి సమాధానం చెప్పాలి. నీ ఇష్టం వచ్చినట్లుగా డబ్బులు విడుదల చేసే అధికారం ఎవరిచ్చారన్నది చెప్పాలి. విచారణకు హాజరు కావడానికి మందీ మార్బలాన్ని వెనకేసుకుని రావడం ఎక్కడి ప్రజాస్వామ్యమో చెప్పాలి. కెటిఆర్ విచారణకు వెళుతున్నారా లేక ..ఏదైనా విజయయాత్రకు వెళుతున్నారా చెప్పాలి. చేసిన తప్పులకు ప్రజాకోర్టులో ప్రజలు ఇప్పటికే శిక్షించారు. కెటిఆర్ విచారణకు వస్తుంటే దాదాపు 200 మంది పోలీసులు అక్కడ మోహరించాల్సి వచ్చింది. అటు, ఈడీ కార్యాలయం వద్ద అధిక సంఖ్యలో



బీఆర్‌ఎస్ కార్యకర్తలు చేరుకోగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం జరిగి తోపులాట చోటు చేసుకుంది. దీంతో అక్కడి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఫార్ములా ఈ రేస్‌లో వ్యవహారానికి సంబంధించి ఏసీబీ దర్యాప్తు చేస్తుండగా.. ఇందులో ఆర్బీఐ అనుమతి లేకుండా విదేశీ సంస్థకు నిదుల చెల్లింపుపై ఈడీ మరో కేసు నమోదు చేసింది. ఇదే కేసులో ఇప్పటికే అప్పటి పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, హెచ్‌ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్‌ఎన్ రెడ్డిలను ఈడీ విచారించింది. కాగా.. ఏసీబీ తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ను కొట్టేయాలని కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించగా.. ఈ నిర్ణయాన్ని ఆయన సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. అయితే, ఈ పిటిషన్‌ను సైతం సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఇంత జరిగినా కెటిఆర్‌కు తాను చేసిన తప్పేంటో తెలియడం లేదని అనుకుంటే ఎలా. తప్పు చేయలేదని నటించినంత మాత్రాన తప్పులు ఒప్పులు కావు. హెచ్‌ఎండీఏ ఖాతా నుంచి విదేశీ సంస్థకు నిధుల బదిలీపై ఈడీ అధికారులు ఆరా తీస్తున్నారు. విదేశీ సంస్థకు రూ. 45.7 కోట్ల బదిలీ వ్యవహారంపై కేటీఆర్‌ను ప్రశ్నిస్తున్నారు. ఇది కళ్లకు కనిపిస్తున్న నిజం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పెడుతున్న కేసులు ఘనతను తుడిచేయలేవని అంటున్నారు. 'హైదరాబాద్‌లో ఫార్ములా ఈ రేస్ నిర్వహణ అనేది మంత్రిగా తాను తీసుకున్న నిర్ణయాల్లో మంచిదని చెబుతున్నారు. ఆనాడు రేసర్లు అంతా హైదరాబాద్ వచ్చి నగరాన్ని కీర్తించారట. హైదరాబాద్ నగర బ్రాండ్ నాకు ముఖ్యం. పారదర్శకంగా రూ. 46 కోట్లు బ్యాంక్ టు బ్యాంక్ విధానంలో చెల్లించిన తర్వాత అవినీతి ఎక్కడిది..? మనీ లాండరింగ్ ఎక్కడిది..?. ఒక్క రూపాయి కూడా వృథా కాలేదు. ప్రతి పైసాకి లెక్క ఉంది. ఫార్ములా ఈ రేస్ రద్దు వల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం జరిగింది అంటూ వితండవదం చేస్తున్నారు. ఎలాంటి అవినీతి జరగకున్నా కేసులు, కోర్టులంటూ రాజకీయ వేధింపులకు గురి చేస్తున్నారని చేస్తున్న వాదన ఆయన అమాయకత్వాన్ని చాటుతోంది. ఆయన ఇన్నాళ్లూ ఎలాంటి జ్ఞానం లేకుండా మంత్రిగా వెలగబెట్టారని అర్థం అవుతోంది. జగన్ కూడా ఎపిలో కూటమి విఫలం అయ్యిందని విమర్శలు మొదలు పెట్టారు. అప్పులు చేసి ఏం చేశారో చెబితే బాగుండేది. కానీ అలాకాకుండా అధికారం కోసం ఇప్పటి నుంచే తనవంతుగా ఎదురుదాడి యత్నాలకు శ్రీకారం చుట్టారు. రాజకీయ అవినీతిని విచారించేందుకు లోక్‌పాల్ లాంటి సంస్థలే శరణ్యం. ఈ దిశగా అడుగులు పడాలి. అప్పుడే దేశం బాగుపడుతుంది.

# రగులుతున్న పశ్చిమాసియా... ప్రపంచంపై పెను ప్రభావం




టెహ్రాన్:ఇరాన్ ఇంతకాలం హమాస్, హెజ్బొల్లా వంటి ప్రాంతీయ శక్తులను ఇజ్రాయెల్ పైకి ఎగదోసేది. ఇప్పుడు ఇజ్రాయెల్ నేరుగా ఇరాన్‌పై దాడికి దిగింది. రెండు దేశాలూ డ్రోన్లు, క్షిపణులతో దాడులు, ప్రతిదాడులు చేసుకుంటున్నాయి. ఇరాన్ ఇంతకాలం హమాస్, హెజ్బొల్లా వంటి ప్రాంతీయ శక్తులను ఇజ్రాయెల్ పైకి ఎగదోసేది. ఇప్పుడు ఇజ్రాయెల్ నేరుగా ఇరాన్‌పై దాడికి దిగింది. రెండు దేశాలూ డ్రోన్లు, క్షిపణులతో దాడులు, ప్రతిదాడులు చేసుకుంటున్నాయి. ఇది పశ్చిమాసియాతోపాటు మిగతా ప్రపంచంపైనా తీవ్ర ప్రభావం చూపకమానదు. ఇరాన్-ఇజ్రాయెల్ వైరానికి 1979లోనే బీజం పడింది. ఆ ఏడాది ఇరాన్‌లో మతశక్తుల నాయకత్వంలో విప్లవం సంభవించింది. అయతుల్లా ఖొమైనీ సారథ్యంలోని ఇరాన్ మత పాలకులు ఇజ్రాయెల్‌ను జియోనిస్టు శత్రువుగా ప్రకటించారు. ఆ తర్వాత లెబనాన్‌లో హెజ్బొల్లా, గాజాలో హమాస్‌కు ఇరాన్ మద్దతునిచ్చి ఇజ్రాయెల్‌పై పోరుకు ఉసిగొల్పింది. ఇజ్రాయెల్‌కు అమెరికా, నాటో కూటమి పూర్తి మద్దతు ఇస్తూ వచ్చాయి. 2024 ఏప్రిల్‌లో సిరియా రాజధాని డమాస్కస్‌లోని ఇరాన్ రాయబారి కార్యాలయంపై ఇజ్రాయెల్ జరిపిన దాడిలో ఇరానియన్ రివల్యూషనరీ గార్డ్స్ అధికారులు హతమయ్యారు. ఇరాన్ అక్టోబరులో ఇజ్రాయెల్‌పై క్షిపణులు, డ్రోన్లతో ప్రతిదాడి చేసింది. తాజాగా ఇజ్రాయెల్ 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరుతో ఇరాన్‌లోని అణు, సైనిక స్థావరాలపై విరుచుకుపడింది. ప్రతిగా ఇరాన్ డ్రోన్లు, క్షిపణులతో ఇజ్రాయెల్‌లోని నగరాలపై దాడి చేసినా, ప్రాణనష్టం తక్కువే. ఇజ్రాయెల్‌లోని సైనిక స్థావరాలు, ఇంధన మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకున్న ఇరాన్ బాలిస్టిక్ మిసైళ్లు గణనీయమైన నష్టాన్ని కలిగించినట్లు తెలుస్తోంది. మరోవైపు, అణ్వాయుధ నిరోధ ఒప్పందం (ఎన్‌పీటీ) నుంచి ఉపసంహరించుకునే దిశగా ఇరాన్ యోచిస్తోంది.

### పరిస్థితి ముదిరే అవకాశం

ఇరాన్-ఇజ్రాయెల్ పోరు ప్రభావం పశ్చిమాసియాకు మాత్రమే పరిమితం కాలేదు. మిగతా ప్రపంచంపై కూడా ఆర్థిక, రాజకీయ ప్రభావాన్ని కనబరుస్తోంది. ఇరాన్ తీరంలోని హొర్ముజ్ జలసంధి ద్వారానే ప్రపంచ చమురు వాణిజ్యంలో అత్యధిక భాగం నడుస్తోంది. ఈ జలసంధి బందయితే చమురు నౌకల రాకపోకలు స్తంభించిపోయి ప్రపంచార్థికం దెబ్బతింటుంది. ముఖ్యంగా లెబనాన్, ఇరాక్, సిరియాలను తీవ్రంగా దెబ్బతీస్తుంది. ఇజ్రాయెల్, ఇరాన్‌లకూ ఆర్థికంగా పెనునష్టం కలిగిస్తుంది. ఇజ్రాయెల్ ఆర్థిక వ్యవస్థ 2025లో మూడు శాతం వృద్ధిరేటు సాధిస్తుందని మొదట్లో అంచనా వేసినా, ప్రస్తుత పోరు ఆగకపోతే ఆ అంచనా తప్పిపోతుంది. ఇప్పటికే ఆంక్షలతో సతమతమవుతున్న ఇరాన్‌కు తాజా పరిణామాలతో చమురు ఎగుమతులు నిలిచిపోతే ద్రవ్యోల్బణం కట్టు తప్పుతుంది. అది రాజకీయ అస్థిరతకు దారితీయకమానదు. అమెరికా చొరవతో గతంలో కుదిరిన అబ్రహాం ఒప్పందాల అమలుకు యుద్ధ పరిస్థితులు అవరోధంగా మారనున్నాయి. తాజాగా అమెరికా-ఇరాన్‌ల మధ్య జరగాల్సిన అణు చర్చలు పట్టాలు తప్పాయి. చర్చల నుంచి వైదొలగుతామనీ, అంతర్జాతీయ అణుశక్తి సంస్థ(ఐఏఈఏ)తో మాత్రమే సంబంధాలు కొనసాగిస్తామని ఇరాన్ హెచ్చరించింది. దారికి రాకపోతే ఇరాన్‌పై మరింత తీవ్రంగా దాడులు జరుగుతాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. వెంటనే అణు ఒప్పందం కుదుర్చుకోవడం మంచిదని హితవు పలికారు. ఇజ్రాయెల్ దాడులను విమర్శించిన రష్యా, చైనాలు ఇరాన్‌కు ఆయుధ, సాంకేతిక, దౌత్య సహాయాల్ని అందించి, ప్రత్యామ్నాయ సైనిక కూటములలో చేరాల్సిందిగా ప్రతిపాదించవచ్చు. ఇరాన్-ఇజ్రాయెల్ పోరులో ప్రధాన దేశాలు జోక్యం చేసుకోవడం వల్ల పరిస్థితి మరింత ముదరవచ్చు.

### భారతదేశానికి నష్టదాయకం

పశ్చిమాసియా నుంచి వచ్చే చమురు సరఫరాలపై భారత ఆర్థిక వ్యవస్థ ఆధారపడి ఉంది. ఈ దేశాల్లోని భారతీయ కార్మికులు, నిపుణులు జమచేసే విదేశ మారక ద్రవ్యం ఇండియాకు ఎంతో ప్రయోజనకరం. పశ్చిమాసియాతో భారత్‌కు సైనిక వ్యూహపరమైన ప్రయోజనాలూ ఉన్నాయి. అందువల్ల ఇరాన్-ఇజ్రాయెల్ పోరు దీర్ఘకాలం కొనసాగడం భారత్‌కు నష్టదాయకమే. చమురు సరఫరా స్తంభిస్తే ఇండియాలో ధరలు పెరిగిపోతాయి. రవాణా, పారిశ్రామికోత్పత్తి దెబ్బతింటాయి. ఎరువుల కొరతతో ఆహారోత్పత్తి తగ్గే ప్రమాదం ఉంది. ఇండియాకు ఇజ్రాయెల్‌తో రక్షణ, సాంకేతికపరంగా పొత్తు ఉంది. ఇరాన్‌లో చాబహార్ రేవును అభివృద్ధి చేయడం ద్వారా మధ్యాసియాతో రవాణా అనుసంధానం ఏర్పరచుకోవడానికి భారత్ కృషిచేస్తోంది. అందుకని ఇరాన్, ఇజ్రాయెల్‌లలో ఎటువైపూ మొగ్గలేని పరిస్థితి నెలకొంది. దౌత్యమార్గాల్లో పోరు విరమణకు ప్రయత్నాలు చేయడం మినహా మార్గాంతరం లేదు. పశ్చిమాసియాలో సంక్షోభం దీర్ఘకాలం కొనసాగితే, అక్కడున్న భారతీయ కార్మికులు, నిపుణుల భద్రత, వారు స్వదేశానికి పంపే మొత్తాలూ అనిశ్చితిలో పడతాయి.

### అంతర్జాతీయ సమీకరణాల్లో మార్పులు

ప్రస్తుతం నడుస్తున్న యుద్ధం ఇరాన్, ఇజ్రాయెల్ మధ్యే సాగుతుందా, ఇతర శక్తులూ జోక్యం చేసుకుంటాయా అన్నది త్వరలో తేలిపోతుంది. ఇజ్రాయెల్ దాడుల వల్ల ఇరాన్ బాగా బలహీనపడింది. కాబట్టి హమాస్, హెజ్బొల్లా, హూతీలను అది ఉసిగొల్పగలదా అనేది అనుమానమే. పశ్చిమాసియాలో ఇరాన్ మద్దతుతో నడిచే ప్రభుత్వాలు, సంస్థలు పడిపోతుంటే అమెరికా మద్దతు గల దేశాల బలం పెరుగుతోందని అమెరికన్ విశ్లేషకుడు ఎడ్ హుసేన్ వ్యాఖ్యానించారు. తాజా దాడులతో ఇరాన్ సైనిక పాటవాన్ని దెబ్బతీయడమే కాకుండా అక్కడి మత పాలకులపై తిరుగుబాటును ప్రేరేపించడమూ ఇజ్రాయెల్ వ్యూహంలో భాగమేనన్నది మరో అమెరికన్ నిపుణుడు స్టీవెన్ కుక్ అంచనా. ఇరాన్ నేరుగా అమెరికా స్థావరాలపై దాడి చేస్తే తప్ప, అగ్రరాజ్యం ప్రత్యక్షంగా సైనిక జోక్యం చేసుకోదని మరో అమెరికన్ ప్రతినిధి ఎలియట్ అబ్రామ్స్ చెబుతున్నారు. ఇజ్రాయెల్ దాడులతో పశ్చిమాసియాలో ఇరాన్ పలుకుబడి క్షీణిస్తుంది. ఫలితంగా ప్రాంతీయ, అంతర్జాతీయ సమీకరణలలో మార్పు రానుంది. పరస్పర అపనమ్మకాలు ముదిరిన నేపథ్యంలో అంతర్జాతీయ సంధి యత్నాలు ఏ మేరకు సఫలమవుతాయన్నది ప్రశ్న. భారతదేశానికి ఇరాన్, ఇజ్రాయెల్‌లు రెండింటితో సత్సంబంధాలు ఉన్నందువల్ల మధ్యవర్తిత్వం వహించగల స్థితిలో ఉంది. ఇలాంటి కృషి అంతర్జాతీయంగా భారత్ ప్రతిష్ఠను ఇనుమడింపజేయగలదు.

# ఆపరేషన్ కగార్ వెంటనే ఆపాలి

హైదరాబాద్, ఆపరేషన్ కగార్‌కు నిరసనగా ఇందిరాపార్కు వద్ద అఖిల పక్షాలు మహాధర్నా చేపట్టాయి. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను ఎత్తివేయాలని పలువురు ఈ మహాధర్నాలో డిమాండ్ చేశారు. వెంటనే మావోయిస్టులతో శాంతి చర్చలు ప్రారంభించాలని కోరారు. ఈ ధర్నాలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, తమ్మినేని వీరభద్రం, నారాయణమూర్తి, ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధంగా కేంద్రం వ్యవహరిస్తోందని విమర్శించారు. ఆపరేషన్ కగార్‌లో ఎక్కువ మంది ఆదివాసీలే చనిపోతున్నారని తెలిపారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి శాంతియుత చర్చలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ తమ పార్టీ దృష్టిలో ఆపరేషన్ కార్పొరేట్ కబ్జా అని.. మానవత్వానికి ఇది ఒక మచ్చ అని భారాస నేత దాసోజు శ్రావణ్ విమర్శించారు. అణచివేయాల్సింది మావోయిస్టులను కాదు.. దోపిడీనని ఈ ధర్నాలో పాల్గొన్న సినీ నటుడు, దర్శకుడు ఆర్ నారాయణ మూర్తి అన్నారు. మావోయిస్టులను చంపడం కాదు.. జల్, జంగిల్, జమీన్ నినాదానికి పరిష్కారం చూపించాలని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వరరావు కోరారు. ఆదివాసీ, పౌర సంఘాలతో భారత రాజ్యాంగం ఆధారంగా చర్చలు జరపాలన్నారు. శాంతి చర్చలు జరపకపోవడం వల్లే ఆదివాసీ ప్రాంతాల్లో అల్లకల్లోలం నెలకొందని చెప్పారు. 'మావోయిస్టులతో చర్చలు జరపాలని మేం అంటే.. మమ్మల్ని మావోయిస్టులు అంటున్నారు. మేం మావోయిస్టులు అయితే మైకులు ఎందుకు పట్టుకుంటాం.. తుపాకులు పట్టుకునే వాళ్లం'అని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఏ సమస్యనైనా చర్చల ద్వారా పరిష్కారం చేసుకోవచ్చని రాజ్యాంగం చెబుతోందని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అన్నారు. నక్సలైట్లు చర్చలకు సిద్ధంగా ఉంటే.. ప్రభుత్వం చర్చలు జరపాలని కోరారు. రాజశేఖర్‌రెడ్డి హయాంలో మావోయిస్టులతో చర్చలు జరిపారని, మోదీ ప్రభుత్వం మాత్రం మావోయిస్టులు చర్చలకు సిద్ధంగా ఉన్నా చంపేస్తోందని విమర్శించారు. మావోయిస్టులను చంపడం తాత్కాలిక ఉపశమనమేనని శాశ్వత పరిష్కారం కాదన్నారు. శాంతిచర్చలు జరిపితే పరిష్కారం దొరుకుతుందని మోదీ, అమిత్‌షా గ్రహించాలని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగానికి లోబడి ఉందన్నారు. అడవుల్లోని ఖనిజ సంపదను అంబానీ, అదానీలకు దోచిపెట్టేందుకే అమిత్ షా .. నక్సలైట్ రహిత దేశంగా చేస్తామంటున్నారని నటుడు ఆర్ నారాయణ మూర్తి ఫైర్ అయ్యారు పాకిస్తాన్ తో చర్చలు జరిపిన కేంద్రం.. భరత మాత ముద్దు బిడ్డలైన మావోయిస్టులతో ఎందుకు చర్చలు జరపడం లేదని ప్రశ్నించారు. అన్యాయాన్ని అడిగిన వాడు నక్సలైట్.. అడగని వాడు ఆల్ రైట్ అనే ఉద్దేశంతో కేంద్రం వ్యవహరిస్తుందని విమర్శించారు. హైదరాబాద్ ధర్నా చౌక్ లో శాంతి చర్చల కమిటీ మహా ధర్నా జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన... అణిచివేయాల్సింది మావోయిస్టులను కాదు దోపిడీని అని అన్నారు. మావోయిస్టులను అంతం చేయడమే లక్ష్యమని అన్నారు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ . ఇది యుద్ధ సమయం కాదు.. చర్చలతోనే పరిష్కరించుకోవాలని మాస్కో సైప్రస్ లో అన్న మోదీ మావోయిస్టులతో ఎందుకు చర్చలు జరపరని ప్రశ్నించారు. మావోలతో చర్చలు జరపకున్నా సరే... ఆదివాసీ సంఘాలతో చర్చలు జరపాలని సూచించారు. భారత రాజ్యాంగం ఆధారంగా చర్చలు జరపండి. దేశంలోని సహజ వనరులను ప్రజల అభివృద్ధి కోసమే వాడాలని రాజ్యాంగంలో తెలిపిందన్నారు. చర్చలు జరిపితే ఆదివాసీ ప్రాంతాల్లో అల్లకల్లోలం ఆగుతుందన్నారు. చర్చలు జరగకుంటే మావోయిస్టులకు ఇబ్బంది లేదు... ప్రభుత్వానికి ఇబ్బంది లేదు. కానీ ఆదివాసీ బిడ్డలకు కష్టం వస్తుంది.. వారి హక్కుల భంగం కలుగుతుందని హెచ్చరించారు. మావోయిస్టులైన భారత పౌరులను చంపుతున్న మోదీ,అమిత్ షా... వీళ్లేం హిందువలని ప్రశ్నించారు. ఇదేనా రామ రాజ్యం అంటే? ఆపరేషన్ కగార్ ను తక్షణమే ఆపేసి శాంతి చర్చలు జరపాలని అన్నారు. కార్పొరేట్ సంస్థల కోసమే ఆదివాసీలపై కేంద్రం యుద్ధం చేస్తుందన్నారు ప్రొఫెసర్ హరగోపాల్. శాంతి చర్చలే అభివృద్ధికి మార్గం అవుతుందన్నారు. హై సందర్భంగా మాట్లాడిన ఆయన చర్చలతో మావోయిస్టుల సమస్యకు పరిష్కారమని అన్నారు. అడవిలోకి కేంద్రం ఎందుకు వెళ్తోంది. ఆపరేషన్ కగార్ ప్రైవేట్ సంస్థల కోసమే ఆపడం లేదని విమర్శించారు. చర్చలతోనే మావోయిస్టు సమస్య పరిష్కారమని హరగోపాల్ అన్నారు..

# శత్రువ్వ ఎవరంటే?

అమరావతి,రాజకీయాల్లో ప్రత్యర్థులను గుర్తించడం సులువు. సొంత పార్టీలోని శత్రువుల్ని పసిగట్టడం కష్టం. ఒకవేళ ఫలానా వ్యక్తుల వల్ల రాజకీయంగా నష్టపోతున్నామని గుర్తించేలోపే, జరగాల్సింది జరిగిపోయి వుంటుంది. అయితే వైసీపీలో విచిత్రమైన పరిస్థితిని చూడొచ్చు. సహజంగా అధినాయకుడికి దగ్గరగా ఉన్నోళ్లు, మరికొందరిని పార్టీ కోసం పని చేయడానికి ఆలోచిస్తుంటారు. వైసీపీలో మాత్రం అందుకు భిన్నమైన వాతావరణం కనిపిస్తోంది. ఒకవైపు కూటమి పాలనపై వ్యతిరేకత వుందనే ప్రచారం క్రమంగా పెరుగుతోంది. మరోవైపు వైఎస్ జగన్ నాయకత్వంలో పని చేయడానికి ఇప్పటికీ సొంతపార్టీలోని కొందరు భయపడుతున్నారు. అలాగే క్షేత్రస్థాయి నుంచి ఇలాంటి భయాందోళనల్ని వైసీపీ శ్రేణుల్లో చూడొచ్చు. నాయకులుగా ఎదగడానికి ప్రతిపక్షం అనేది మంచి వేదిక అవుతుందని జగన్ తరచూ చెబుతున్నారు. ఆయన అన్నది నిజమే. ప్రతిపక్షంలో బాగా పని చేసేవాళ్లకు మంచి భవిష్యత్ వుంటుందని జగన్ హామీ ఇస్తున్నారు. ఇంత వరకూ బాగానే వుంది. కానీ ఆచరణలోనే ఎంత వరకు అమలవుతుందనే శంక వైసీపీ నాయకులు, కార్యకర్తల్ని వెంటాడుతోంది. జగన్‌ను సీఎంగా చూడాలనే తపనతో పదేళ్లు కష్టపడ్డామని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాతకనీసం పలకరించే దిక్కు లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేపు మళ్లీ జగన్ అధికారంలోకి వస్తే , ఇంతకంటే భిన్నమైన పరిస్థితి ఏముంటుందనే ప్రశ్నకు, అనుమానాలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధిష్టానంపై వుంది. ప్రతిదీ చంద్రబాబు, లోకేశ్‌తో వైసీపీ కార్యకర్తలు, నాయకులు పోల్చుకుంటున్నారు. చంద్రబాబు, లోకేశ్‌ను టీడీపీ కార్యకర్తలు సులువుగా కలుసుకుంటున్నారు. కాకపోతే, ఒకరోజు అటూఇటూ కావచ్చు. ఇదే వైసీపీ కార్యకర్తలకు జగన్‌ను కలవడం అసాధ్యం. పైగా వైసీపీలో ఏకనాయకత్వం. టీడీపీతో పోల్చుకుంటే ప్రజాస్వామ్య లక్షణాలు చాలా తక్కువ. నియోజకవర్గ నాయకుడి కుటుంబం పదవులు, ఆదాయం పంచుకున్న తర్వాత, ఇంకా మిగిలి వుంటే గ్రామస్థాయిలో నాయకులకు, కార్యకర్తలకు సాయం చేస్తారు. ఎంతసేపూ తాము తప్ప, ఇతరులెవరూ అధిష్టానానికి దగ్గర కాకూడదని, అలాగే గుర్తింపు పొందకూడదనే మనస్తత్వం వైసీపీ నాయకులది. ఈ ధోరణే వైసీపీకి ప్రధాన శత్రువు. అందుకే టీడీపీని అన్ని కులాల వాళ్లు తమ పార్టీగా భావించినట్టు, వైసీపీ వరకూ వచ్చేసరికి ఆలోచనలో పడుతుంటారు. అందరినీ కలుపుకునే పోయే మనస్తత్వం వైసీపీలో పెరిగే వరకూ, ఆ పార్టీ ఎదుగుదల అంతంత మాత్రమే. ఇప్పుడైనా కూటమి తనకు తానుగా తెచ్చుకున్న వ్యతిరేకత కారణంగా, వైసీపీలో జోష్ కనిపిస్తోంది. అంతే తప్ప, ఆ పార్టీ పెద్ద నాయకులు చేసిందేమీ లేదు. ఇప్పటికైనా వైసీపీ తన స్వభావాన్ని సంస్కరించుకోవాల్సిన అవసరం వుంది. ప్రజలతో పాటు అన్ని వర్గాలను కలుపుకుని పోయే మనస్తత్వాన్ని అలవరచుకోవాలి. చేజేతులా అభిమానుల్ని దూరం చేసుకునే మనస్తత్వాన్ని పోగొట్టుకోవాలి.

# మేఘాలయ హనీమూన్ హత్య కేసులో మరో ట్విస్ట్



షిల్లాంగ్ : సంచలనం సృష్టించిన మేఘాలయ హనీమూన్ హత్య కేసులో ట్విస్ట్ చోటు చేసుకుంది. పథకం ప్రకారం భర్త రాజా రఘు వంశీని చంపించిన భార్య సోనమ్ రఘువంశీని ఓ పదునైన ఆయుధం పోలీసులకు పట్టించింది. అయితే, ఈ హత్య చేసేందుకు ఒక్క ఆయుధం కాదని, మరో ఆయుధాన్ని వినియోగించినట్లు పోలీసులు సీన్ రీకన్‌స్ట్రక్షన్‌లో గుర్తించారు.ఇక ఈ కేసు విచారించేందుకు ఏర్పాటైన సిట్ బృందం సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేసేందుకు నిందితుల్ని ఇవాళ (జూన్ 17) ఘటన జరిగిన సోహ్రాలోని వీ సావ్‌డాంగ్ జలపాత ప్రాంతానికి తీసుకెళ్లింది. ఈ సీన్ రీకన్‌స్ట్రక్షన్‌లో నిందితులు రాజా రఘువంశీని హతమార్చేందుకు రెండు మారణాయుధాల్ని వినియోగించినట్లు గుర్తించామని ఈస్ట్ కాశీ హిల్స్ సూపరిటెండెంట్ ఆఫ్ పోలీస్ వివేక్ వివేక్ సియాం వెల్లడించారు.

మరి మరో ఆయుధం ఎక్కడ?

సీన్ రీకన్‌స్ట్రక్షన్‌లో హత్య జరిగిన రోజు నిందితులు ఎక్కడ ఏం చేశారు? ఏ ప్రాంతంలో ఉన్నారు? ఏం చేశారు? వంటి వివరాల్ని సేకరించాం. వాళ్లు చెప్పిన వివరాల్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే హత్య కోసం రెండు ఆయుధాల్ని వినియోగించినట్లు తేలింది. ఇప్పటికే ఒక ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నాం. మరో ఆయుధం గురించి అన్వేషణ కొనసాగుతోందన్నారు.

సోనమ్ సైగ.. రాజాపై విశాల్ కత్తితో దాడి

నిందితుల్ని మేం హత్య జరిగిన వ్యూపాయింట్‌కు తీసుకెళ్లాము. అక్కడ ఎవరి పొజిషన్ ఎలా ఉందో? ఎలా దాడి చేశారో? నిర్ధారించాం. నిజానికి, ఇద్దరు నిందితులు వేర్వేరు ఆయుధాల్ని ఉపయోగించారు. రెండో ఆయుధం కోసం వెతుకుతున్నాం. హత్య అనంతరం రాజా రఘువంశీని ఏ లోయలో పడేశారో అక్కడే ఆకాష్ తన చొక్కాను పడేశాడు. తన భర్త రాజా రఘువంశీని హత్య చేయమని సోనమ్ నిందితులకు సైగ చేసింది. ఆ సైగతో రాజా రఘువంశీనీ విశాల్ చౌహాన్ కత్తితో పొడిచాడు. ఆ తర్వాత రాజా నేలకొరిగాడు.

రాజా హత్యను సోనమ్ కళ్లారా చూసింది

'సోనమ్ నేరాన్ని అంగీకరించింది. నేడు మేము క్రైం సీన్‌ను రిక్రియేట్ చేశాము. ఆమె ఎక్కడ నిల్చుంది? హత్యకేసులో ఆమె పాత్ర ఏమిటో గుర్తించాం. రాజాను ముగ్గురు వ్యక్తులు హత్య చేశారు. హత్యను అక్కడే నిల్చొని సోనమ్ కళ్లారా చూశారు. ఆమె తన ఫోన్‌ను ధ్వంసం చేసింది. ఇది ముందే ప్లాన్ ప్రకారం చేసిన హత్యే. హత్య అనంతరం ఆ ముగ్గురు రాజా శరీరాన్ని లోయలో పడేశారు'. వీరు హత్యకు వెయ్ సవ్‌దాంగ్‌ను ఎంచుకున్న కారణం అక్కడ ఎవ్వరూ ఉండరని. వీరందరు మేఘాలయకు రావడం ఇదే తొలిసారిమా టీమ్ ఇప్పటికే ఇండోర్‌లో ఉంది. కేసు నిమిత్తం మరికొందరిని విచారిస్తున్నారు' అని చెప్పారు.

పెళ్లైన 12రోజులకే భర్తను హత మార్చిన భార్య

ఏప్రిల్ 23న రాజా రఘువంశీ,సోనమ్ రఘువంశీల వివాహం జరిగింది. పెళ్లైన 12 రోజులకే ప్రియుడుతో కలిసి జీవించేందుకు సోనమ్ కుట్ర చేసింది. తన భర్త రాజ రఘవంశీ హత్య చేయాలనుకుంది. ఇందుకోసం సోనమ్ తన ప్రియుడు సాయంతో విశాల్ చౌహాన్,ఆనంద్ కుమార్,కాష్ రాజ్‌పుత్‌లకు సుపారీ ఇచ్చింది. ఒప్పందం ప్రకారం.. రాజా రఘువంశీని హతమార్చి తూర్పు ఖాసీ హిల్స్ జిల్లాలోని వీ సావ్‌డాంగ్ హిల్స్‌లో పడేశారు. జూన్ 2న దే జలపాతం వద్ద గుర్తు పట్టలేని విధంగా ఉన్న రాజ రఘువంశీ మృత దేహాన్ని స్వాధీనం చేసుకున్నారు.

# స్థానిక ఎన్నికలపై ఫీవర్..పలకరింపులతో హల్‌చల్




నిజామాబాద్, బీసీ గణనకు సంబంధించి కమిషన్ల రిపోర్టులు ఆధారంగానే రిజర్వేషన్లు పెంచి లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. బహుశా జూలైలో స్థానిక ఎన్నికలు జరిగే ఛాన్స్ ఉందంటూ వార్తలు వస్తున్నాయి. 42శాతం బిసి రిజర్వేషన్లు ప్రకటించాలని బిఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. ఇవిప్రకటించి చిత్తుశుద్ధి చాటుకోవాలని మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. రిజర్వేషన్లు ప్రకటించకుండా స్థానిక ఎన్నికలకు వెళితే ఊరుకోమని ఎమ్మెల్సీ కవిత హెచ్చరించారు. ఇకపోతే ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని బిఆర్ఎస్ భావిస్తోంది. స్థానిక ఎన్నికల్లో ఫుట్‌బాల్ ఆడుతామని కెటిఆర్ ప్రకటించారు. తుది ఓటర్ల జాబితాను అధికారులు ఇటీవల ప్రకటించారు. తాజాగా జిల్లాలో 14,35,214 మంది ఓటర్లుండగా పురుషులకన్నా 80,875 మంది మహిళా ఓటర్లు ఎక్కువ ఉన్నట్టు లెక్క తేలింది. మహిళల తర్వాత యువ ఓటర్లే కీలకం కానున్నారు. కొత్తగా ఓటు హక్కు పొందినవారు 26 వేల వరకు ఉన్నారు. మొత్తం ఓటర్లలో యువతీయువకులే దాదాపు సగం వరకు ఉన్నారు. కొత్త జాబితా ప్రకారం 18 నుంచి 39 ఏండ్ల మధ్య వయస్సున్న ఓటర్ల సంఖ్య 6, 96,014. దీంతో రానున్న లోకల్ బాడీ ఎన్నికల్లో మహిళలు, యువతే కీలకం కానున్నారు. దీంతో యువతలో కూడా సర్పంచ్ పదవులపై ఆశ కనిపిస్తోంది. పంచాయితీలతో పాటు వాటి పరిధిలోని 5,022 వార్డులకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. బ్యాలెట్ బాక్స్ లతో పాటు పేపర్ బ్యాలెట్ రెడీ చేశారు. జిల్లాలో 31 మండలాలున్నాయి. పంచాయతీ ఎన్నికల తర్వాత ఈ మండలాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలన్నింటి లోనూ యువత, మహిళలే నిర్ణేతలు కానున్నారు. వారు ఎవరివైపు మొగ్గు చూపితే వాళ్లే అందలమెక్కే చాన్స్‌ఉందని అంటున్నారు. గత ఏడాది ఫిబ్రవరిలోనే సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసింది. జులైలో ఎంపీటీసీ, జడ్పీటీసీలు కూడా మాజీలయ్యారు.మున్సిపల్ కార్పొరేషన్లు, కౌన్సిళ్ల టర్మ్ పూర్తికానుంది. దీంతో రూరల్, అర్బన్ లోకల్ బాడీలకు వరుసగా ఎన్నికలు జరగనున్నాయి. కొత్తగా 15 గ్రామ పంచాయ తీలు ఏర్పడడంతో జిల్లాలో పంచాయితీల సంఖ్య 545 పెరిగింది. ఈ క్రమంలో జిల్లాలో అప్పుడే స్థానిక హడావిడి మొదలయ్యింది. ముఖ్యంగా పంచాయితీ సర్పంచ్ పదవులకు పోటీ చేసే వారంతా ఇప్పటి నుంచే గ్రామాల్లో కరచాలనాలు మొదలు పెట్టారు. పలకరింపులు చేస్తున్నారు. బాగున్నావా అని ఆత్మీయంగా చూస్తున్నారు. పెళ్లిళ్లు, పేరంటాల సందర్భంగా గ్రామాల్లో ఇదే సందడి కనిపించింది. వాడు సర్పంచ్‌కు పోటీ చేస్తున్నాడనే కామెంట్స్ కూడా బాగానే వినిపించాయి. ఇకపోతే జిల్లాలో మహిళా ఓటర్లు అధిక సంఖ్యలో ఉన్నారు. జిల్లా పరిధిలో ఐదు అసెంబ్లీ నియోజక వర్గాలతో పాటు బాన్సువాడ సెగ్మెంట్‌లోని కొన్ని మండలాలున్నాయి.

# ట్రంప్ తీరుతో అమెరికాలో అనిశ్చితి



వాషింగ్టన్,హెచ్1బి వీసాలను ఆసియావాసులు దుర్వినియోగం చేస్తున్నారనీ ఉన్నత చదువుకోసం వచ్చి ఉద్యోగాలను ఎగరేసుకుపోతున్నారనీ ప్రస్తుతం అమెరికాలో చెలరేగిపోతున్న విమర్శల వెనుకా మెజారిటీ శ్వేత జాతీయవాద విపరీత పోకడ వెల్లడవుతోంది. అమెరికన్ల ఉద్యోగాలను కొట్టేస్తున్నారన్న విమర్శ ఆసియావాసులను ప్రస్తుతం సంక్షోభంలోకి నెడుతోంది. దీనికితోడు ఏరివేత కార్యక్రమాలు, ఆంక్షలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. ఆందోళనలు వస్తున్నా ట్రంప్ లెక్క చేయడం లేదు. లాస్‌ఏంజిల్స్ ఆందోళనలను సైన్యంతో అణిచివేయించారు. చదువు ముగిసిన తర్వాత ఉద్యోగాలు చేసే కాలాన్ని బాగా తగ్గించాలనే డిమాండు ఊపందుకుంటోంది. ఇది జరిగితే బాగా నష్టపోయేది భారతీయులే. లక్షలు ఖర్చుపెట్టి అమెరికాలో చదువుతున్న మొత్తం విదేశీ విద్యార్థుల్లో 25 శాతం పైగా భారతీయులే ఉన్నారు. అభివృద్ధిచెందిన దేశాల్లో పలుచోట్ల జనాకర్షణ, ఉన్మాద నినాదాలతో ఓట్ల రాజకీయాల్లో పైచేయి సాధిస్తున్న నేతల్లో విపరీత జాతీయవాద పోకడలు లేని వాళ్లను వేళ్లమీద లెక్కపెట్టొచ్చు. ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతుల చేపట్టాక ఈ విపరీతం మోతాదు బాగా మించిపోతోంది. వలసదారులకు, శరణార్థులకు సురక్షిత ప్రదేశంగా ఉన్నప్పుడే అమెరికా ఘనత గొప్పగా ఉంటుందని కెన్నడి ప్రగాఢంగా చెప్పారు. పౌరహక్కుల చట్టమే లేకపోతే ప్రజాస్వామ్యం గురించి, సమన్యాయపాలన గురించి, పౌరసమానత్వం గురించి ప్రపంచానికి నీతులు చెప్పే నైతిక అర్హతే అమెరికాకు ఉండేది కాదు. అవకాశాల సీమగా ఇప్పటికీ అమెరికాను పరిగణిస్తూ ప్రతి ఏటా దాదాపు లక్షల మందికి పైగా ప్రజలు అక్కడికి వెళుతున్నారు. 2021-24 మధ్య సగటున ఏడాదికి 24లక్షల మంది అక్కడికి చేరుకున్నారు. 1965 నుంచి చూస్తే క్రమేపీ లాటిన్ అమెరికా, ఆసియా నుంచి అమెరికాకు వెళ్లే వారి సంఖ్య బాగా పెరిగింది. మొత్తం వలసదారుల్లో 50 శాతం వారే ఉన్నారు. ఇంతగా వెళుతున్న వారందరికీ అక్కడ సమభావనతో సమాజంలో స్వాగతం లభిస్తోందనీ ఇప్పటికీ చెప్పలేం. ఎన్నోరూపాల్లో శ్వేతజాతి ఆధిక్యతా ధోరణులు ఎదురవుతున్నాయి. వలసల చరిత్రలోని విషాదాలనూ రాజకీయాలనూ జాతి ఆధిక్యతా ధోరణులనూ తెలుసుకుంటేనే ఈనాటి ట్రంప్ విధానాల నేపథ్యమూ అర్థం అవుతుంది. అమెరికా ఆధిక్యతకూ శ్వేతవర్గానికీ పెద్దపీట వేయాలనే తర్కానికీ ట్రంప్‌తో మళ్లీ ఊపు వచ్చినా దాని మూలాలు ఇప్పటివి కావు! ఆధిపత్య భావజాలాలపై ఆధారపడిన జాతీయవాదాలు ఎక్కడైనా నిలువరించాల్సిందే.

# నితీశ్‌కు చిరాగ్ చెక్ పెడతారా? 2005 సీన్ రిపీట్ అవుతుందా?



బిహార్ రాజకీయాలు ప్రస్తుతం రసవత్తరంగా మారాయి. లోక్ జనశక్తి - రామ్ విలాస్ (ఎల్‌జేపీ - ఆర్‌వీ) పార్టీ చీఫ్ చిరాగ్ పాశ్వాన్ కేంద్ర మంత్రిగా ఉంటూనే రాష్ట్ర రాజకీయాలపై తన దృష్టి సారించారు. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు ఆయన గట్టి పోటీనిస్తారనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఈ ఏడాది అక్టోబరు-నవంబరులో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో చిరాగ్ వ్యూహం నితీశ్‌కు ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

2020 ఎన్నికల ఫలితాలు - చిరాగ్ ప్రభావం

2020 బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో చిరాగ్ పాశ్వాన్ ఒంటరిగా పోటీ చేసి, నితీశ్ కుమార్ సారథ్యంలోని జేడీయూకు భారీ నష్టాన్ని కలిగించారు. జేడీయూ 115 స్థానాల్లో పోటీ చేసి 43 సీట్లకే పరిమితం కాగా, బీజేపీ 74 సీట్లు గెలుచుకుంది. ఎల్‌జేపీ ఒకే సీటు గెలిచినా, జేడీయూ ఓటమికి చిరాగ్ వ్యూహం కీలకమైంది. జేడీయూ పోటీ చేసిన 38 స్థానాల్లో ఎల్‌జేపీ అభ్యర్థులకు ఎక్కువ ఓట్లు రాగా, 26 చోట్ల జేడీయూ ఓటమికి ఎల్‌జేపీ ఓట్లే కారణమయ్యాయి.

తండ్రి బాటలో కొడుకు: 2005 నాటి వ్యూహం

2005 బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో రామ్ విలాస్ పాశ్వాన్ కింగ్ మేకర్‌గా మారి, లాలూ ప్రసాద్ యాదవ్ ముఖ్యమంత్రి కాకుండా అడ్డుకున్నారు. లాలూకు వ్యతిరేకంగా అభ్యర్థులను నిలబెట్టి 29 సీట్లు గెలుచుకున్న ఆయన, మతతత్వ, అవినీతి పార్టీలతో కలవబోనని ప్రకటించి, ముస్లిం ముఖ్యమంత్రికి మద్దతు ఇస్తానని చెప్పారు. దీనివల్ల బిహార్‌లో రాష్ట్రపతి పాలన విధించారు, ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో నితీశ్ కుమార్ తొలిసారి సీఎం అయ్యారు. ఇప్పుడు రామ్ విలాస్ పాశ్వాన్ కుమారుడు చిరాగ్ పాశ్వాన్ అదే వ్యూహాన్ని నితీశ్‌పై ప్రయోగించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. తనను తాను 'మోదీ హనుమంతుడు'గా అభివర్ణించుకుంటూ, ఎన్‌డీఏలో ఉంటూనే జేడీయూకు సవాలు విసురుతున్నారు.

సీట్ల సర్దుబాటు, కింగ్ మేకర్ పాత్ర

రాబోయే ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమిలో సీట్ల సర్దుబాటు చిరాగ్ పాశ్వాన్‌కు కీలక అంశం కానుంది. 2020లో జేడీయూను ఓడించిన 32 సీట్లపై ఎల్‌జేపీ గురి పెట్టింది. బీజేపీ స్ట్రైక్ రేట్ ఎక్కువగా ఉన్నందున, జేడీయూనే సీట్లను త్యాగం చేయాల్సి వస్తుందని అంచనా. ఒకవేళ జేడీయూ సీట్లు తగ్గి, ఎల్‌జేపీ బలం పుంజుకుంటే, చిరాగ్ కింగ్ మేకర్‌గా మారే అవకాశం ఉంది. అప్పుడు నితీశ్ ముఖ్యమంత్రి పీఠానికి ప్రమాదం ఏర్పడవచ్చు. రాజకీయాలు ఊహించని మలుపులు తిరుగుతాయి కాబట్టి, ఫలితాల తర్వాత చిరాగ్ తేజస్వి యాదవ్‌తో కూడా పొత్తు పెట్టుకునే అవకాశం లేకపోలేదు. బీజేపీ, నితీశ్‌ను దారికి తెచ్చుకునే అవకాశం ఉంది, ఒకవేళ కుదరకపోతే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించే అవకాశం ఉంది.

# ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సంచలనం...



హైదరాబాద్,ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలకమైన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. మావోయిస్టుల పేరు చెప్పి ఫోన్ ట్యాపింగ్ కి ప్రభాకర్ రావు పాల్పడినట్లు అధికారులు గుర్తించారు.సాధారణ ఎన్నికల సమయంలో 600 మంది మావోయిస్టులకు సహాయం చేస్తున్నారని చెప్పి 600 ఫోన్ నెంబర్లను రివ్యూ కమిటీకి ఇచ్చి ట్యాపింగ్ కి పాల్పడ్డారు.. అయితే, ప్రతి రెండు నెలలకు ఒకసారి రివ్యూ కమిటీ సమావేశం అవుతుంది. ఈ సమావేశంలో ఎవరెవరు ఫోన్లు ట్యాప్ చేస్తారనే విషయం మీద చర్చ జరుగుతుంది. ఈ 600 ఫోన్ నెంబర్లను రివ్యూ కమిటీకి ప్రభాకర్ రావు సమర్పించాడు.. ఆ తర్వాత ఆ ఫోన్ నెంబర్లను రివ్యూ కమిటీ నేరుగా డీవోపీటీకి పంపించడం జరిగింది. మావోయిస్టులు ఎన్నికల సమయంలో చాలా యాక్టివ్ గా తయారయ్యారని, చాలామంది సానుభూతిపరులు ఉన్నారని, వారికి సహాయం చేస్తున్నారని, మావోయిస్టులకు డబ్బులు ఇస్తున్నారని, షెల్టర్ కల్పిస్తున్నారని చెప్పి ప్రభాకర్ రావు ఆ ఫోన్ నెంబర్లను ట్యాపింగ్ కు పర్మిషన్ తీసుకున్నాడు.. ఇక, రివ్యూ కమిటీ మాత్రం ఎలాంటి నెంబర్ల మీద వెరిఫికేషన్ చేసుకోకుండానే అనుమతి ఇవ్వడం జరిగింది.అయితే, మావోయిస్టుల పేర్ల మీద ఏకంగా రాజకీయ నాయకులతో పాటు ప్రతిపక్ష అధికారపక్ష, వ్యాపారవేత్తలు, జర్నలిస్టు మీడియా చైర్మన్లు, జడ్జిలు, పోలీస్ అధికారులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల ఫోన్ నెంబర్లకు ప్రభాకర్ రావు దొడ్డి దారిన ట్యాపింగ్ కి పర్మిషన్ తెచ్చుకున్నాడు. ఇక, ఈ పర్మిషన్ తీసుకున్న తర్వాత నవంబర్ 15వ తేదీ నుంచి 600 సెల్ ఫోన్లపై ట్యాపింగ్ చేయడం ప్రారంభించాడు. సాధారణ ఎన్నికల్లో మొత్తంగా అప్పటి ప్రతిపక్ష నాయకులు కాంగ్రెస్, బీజేపీ, వామపక్షాలకు చెందిన కీలక నేతలతో పాటు వాళ్ళ అనుచరులు, కుటుంబ సభ్యుల ఫోన్లను సైతం ట్యాపింగ్ చేశారని తెలిపారు. 3 రోజుల పాటు ప్రభాకర్ రావును విచారించినప్పుడు ఈ విషయమే వెలుగులోకి వచ్చింది. అయితే, ప్రభాకర్ రావు మాత్రం తాను వృత్తిలో భాగంగానే ట్యాపింగ్ చేశానని ఎక్కడ ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని వెల్లడించారు.

అప్పటి ప్రతిపక్ష నేతలకు ఎవరైనా ఆర్థిక సహాయం చేస్తూ ఉంటే ఆ సమాచారం వెంటనే ప్రణిత్ రావుకు వచ్చే విధంగా ఏర్పాటు చేసుకున్నాడు.. ముందస్తుగా ప్రణీత్ రావు దగ్గర అందరి సెల్ ఫోన్ నెంబర్లు, డబ్బు ఉండేది అన్నారు.ఇక, దాని ఆధారంగా ప్రతిపక్ష నేతలకు ఆర్థిక సాయం చేస్తున్న వారి వివరాలు వచ్చి రావడంతోనే వెంటనే భుజంగరావుకు ప్రణీత్ రావు సమాచారం ఇచ్చేవాడు. దీంతో భుజంగరావు నేరుగా స్థానిక టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులకు ఫోన్ చేసి ప్రతిపక్ష నేతలకు డబ్బులు పంపిస్తున్న వారి వివరాలను చెప్పేవాడు. దీంతో పాటుగా భుజంగరావు హైదరాబాద్ టాస్కూ ఫోర్స్ డీసీపీ రాధాకిషన్ కి సమాచారం ఇచ్చేవాడు. ఆ తర్వాత రాధాకిషన్ ఆ ఫోన్లను ట్రాక్ చేసి డబ్బులను స్వాధీనం చేసుకునేవాడు. అదే మాదిరిగా రాజకీయ ఎత్తుగడలు ఏదైనా వేస్తే వెంటనే ప్రణీత్ రావు, భుజంగరావును అలర్ట్ చేస్తే.. టీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు భుజంగరావు చెప్పేవాడు అని తేలింది. ముఖ్యంగా, టిఆర్ఎస్ పార్టీ నుంచి వెళ్లి ఇతర పార్టీలో చేరిన నాయకులకు సంబంధించిన ప్రతి చిన్న వివరాలను కూడా ఈ ట్యాపింగ్ ద్వారా తెలుసుకున్నారు.. ఇందులో రేవంత్ రెడ్డి, ఈటెల రాజేందర్, రఘునందన్ రావుతో పాటు డీఎస్, ఆయన కుమారుడు అరవింద్ సహా పలువురి ఫోన్లను ట్యాప్ చేశారు. మరోవైపు, బీఆర్ఎస్ ఖచ్చితంగా కొన్ని స్థానాలను గెలుచుకోవాలి ఆ స్థానాలలో ప్రత్యర్థుల కదిలికలను ఎప్పటికప్పుడు తెలుసుకున్నారు.. ఏది ఏమైనప్పుడు కూడా 600 మంది రాజకీయ, వ్యాపారస్థులకు చెందిన సమాచారాన్ని ట్యాపింగ్ చేయడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో పెను తుఫాన్ సృష్టిస్తుంది.

## 42శాతం బిసి రిజర్వేషన్లు సాధిస్తాం

మెదక్,బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు సాధించుకుంటామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. బీసీలంతా చైతన్యం కావాలని కోరారు. కామారెడ్డిలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఎన్నికల సమయంలో ప్రకటించిన డిక్లరేషన్ సాధించే వరకు పోరాడుతామని అన్నారు. మెదక్ జిల్లాలో కామారెడ్డి డిక్లరేషన్ రాజ్యాంగ బద్ధంగా 42శాతం రిజర్వేషన్ల సాధన కోసం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కల్వకుంట్ల కవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఇది రాజకీయ వేదిక కాదు.. మానవ హక్కుల వేదిక అని చెప్పారు. విద్యకు, ఉద్యోగాలకు, రాజకీయాలకు వేర్వేరుగా రేవంత్ ప్రభుత్వం రిజర్వేషన్ బిల్లులు పెట్టాలని ఎమ్మెల్సీ కవిత కోరారు. ఢిల్లీకి బీసీ రిజర్వేషన్ బిల్లు పంపామని తమకు ఏం సంబంధం లేదనేలా కాంగ్రెస్ నేతలు అనడం సరికాదని చెప్పారు. బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఒక్కరోజైనా బీసీ బిల్లు గురించి ప్రధానమంత్రి నరేంద్రమోదీతో మాట్లాడారా అని ప్రశ్నించారు. బీసీ బిల్లు వస్తే ఉద్యోగాలు, రాజకీయ అవకాశాలు, నిధులు వస్తాయని అన్నారు.

# తెలంగాణలో తప్పులు తడకగా కులగణన



హైదరాబాబాద్,తెలంగాణలో కులగణన తప్పుల తడకగా సాగిందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే దన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు.. సర్వే చేసే వారు మా ఇంటికే రాలేదు. బీసీల జనాభా ఎలా తగ్గింది? బీసీల్లో మైనార్టీలను చేర్చడాన్ని భాజపా వ్యతిరేకించిందన్నారు. దీనిని గోరంతలు కొండంతలు చేసి మాట్లాడుతున్నారని మండిపడ్డారు.కాంగ్రెస్ అబద్ధపు హామీలతో ప్రభుత్వంలోకి వచ్చింది. కాంగ్రెస్‌లో జరిగిన అభివృద్ధి కన్నా రెండింతల అభివృద్ధి మోదీ 11 ఏళ్ల పాలనలో జరిగిందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే దన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. భాజపా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 40 ఏళ్ల కల.. పసుపు బోర్డు నిజామాబాద్‌కు వచ్చిందని, జనగణనతోపాటు కులగణన చేపట్టాలని మోదీ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. 'ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో విద్యార్థులకు కాలేజీలు సర్టిఫికెట్లు ఇవ్వట్లేదు. ప్రభుత్వ పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావట్లేదు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఎమ్మెల్యే సూర్యనారాయణ డిమాండ్ చేశారు.గత ప్రభుత్వం అందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చి..ఎన్నికల సమయంలో నిబంధనలకు విరుద్ధంగా కొందరికి ఇళ్లు కేటాయించిందని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్ గౌడ్ విమర్శించారు. 'తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలో 2,700 ఇళ్లు కట్టారు. ఆ ఇళ్లను స్థానికులకు కాకుండా దాదాపు 2,500 ఇళ్లను హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఒకే మతానికి చెందిన వారికి ఇచ్చారు. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా హైకోర్టులో కేసు వేస్తే.. న్యాయస్థానం కీలక తీర్పు ఇచ్చింది. ఇళ్ల కేటాయింపు ఇల్లీగల్ అని పేర్కొంది. ఈ తీర్పు అన్ని ప్రాంతాల్లో కేటాయించిన వారికి వర్తిస్తుంది.

# తానెప్పుడూ పార్టీ ఐక్యత కోసమే పనిచేశా



హైదరాబాద్,:పార్టీలోని ప్రతి ఒక్కరూ బాగుపడాలి, తెలంగాణలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావాలనేది తన లక్ష్యమని ఎమ్మెల్యే రాజాసింగ్ పునరుద్ఘాటించారు. తానెప్పుడూ వ్యక్తిగత లబ్ధి లేదా పదవుల కోసం పని చేయలేదని స్పష్టం చేశారు. తన కృషి ఎప్పుడూ పార్టీని బలోపేతం చేయడం, పార్టీ ఆదర్శాలను అంకితభావంతో పనిచేయడంపైనే తాను దృష్టి పెట్టానని అన్నారు. కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తనపై చేసిన వ్యాఖ్యలపై బీజేపీ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ స్పందించారు. పార్టీలో అందరికీ తగిన గౌరవాన్ని ఇస్తూ, ఈ విషయంపై తాను నేరుగా స్పందించాలనుకుంటున్నానని తెలిపారు. తన ఉద్దేశ్యం ఎప్పుడూ సరళంగా, నిష్కల్మషంగా ఉంటుందని తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటనను రాజాసింగ్ విడుదల చేశారు.

అయితే, తెలంగాణలోని అన్ని 119 నియోజకవర్గాల్లో ఎలా విజయం సాధించడానికి బదులుగా, తనను మాత్రమే లక్ష్యంగా చేసుకొని, తనను విడదీసి, అడ్డంకులు సృష్టిస్తున్నారని.. అయినప్పటికీ తాను పార్టీకి అంకితమైన, నిస్వార్థ సేవ చేశానని రాజాసింగ్ చెప్పారు. పార్టీ కార్యకర్తను ఇబ్బంది పెడితే ఏం లాభమని రాజాసింగ్ ప్రశ్నించారు. తాను ఎప్పుడూ పార్టీకి అనుకూలంగా నిలబడ్డానని గుర్తుచేశారు. ఈ రోజు తాను తన కోసం కాకుండా, పార్టీ ఐక్యతకు, అదే ఉద్దేశ్యంతో పనిచేస్తున్న లక్షలాది కార్యకర్తల మనోబలాన్ని కాపాడుకోవటం కోసం మాట్లాడుతున్నానని స్పష్టం చేశారు. కిషన్‌రెడ్డి తమకు కొంత సమయం కేటాయించాలని కోరారు. తాను, పార్టీ సహచరులు మీతో వ్యక్తిగతంగా కలిసి, తమ సమస్యలను మీ దృష్టికి తీసుకువస్తామని చెప్పారు. కిషన్‌రెడ్డి ఎక్కడైనా, ఎప్పుడైనా సమావేశం నిర్ణయిస్తే తాము రావడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. తాము పార్టీని విభజించడానికి కాదని, ఐక్యతను తీసుకురావడానికి కృషి చేస్తామని అన్నారు. పార్టీ నిజమైన లక్ష్యాన్ని మనం మరచిపోకూడదని చెప్పారు. తెలంగాణకు బీజేపీ ప్రభుత్వం అవసరమని అన్నారు. వ్యక్తిగత విభేదాలను విడిచిపెట్టి, ఐక్యంగా పని చేద్దామని రాజాసింగ్ కోరారు.

Printed, Published & Owned by **MEDE SHANTHI KUMAR**, Printed at **SPOORTHI PRINTERS**, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001, Published From **SPOORTHI PUBLICATIONS**, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001 Editor: **MEDE SHANTHI KUMAR.**